ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

జూన్ 28, 2009

అమెరికా స్వాతంత్ర్యం ఒక మేడిపండు

హ్యాపీ బర్త్‌డే

(2009 జూన్ 28 నుంచి
2009 జులై 4 వరకు)

ఎస్. రాజేశ్వరి
1సం॥,జూన్-2008
రజని-మురళి
రాయపోల్-మెదక్



ఎ. సాయి కుమార్
జులై-1
స్వాతి-రాజ్‌కుమార్
ఆమన్‌గల్-మ॥నగర్

ఎ. కిరణ్‌కుమార్
7సం॥,జూన్-2002
స్వాతి-రాజ్‌కుమార్
ఆమన్‌గల్-మ॥నగర్

పి. మనోజ్ కుమార్
జులై-2
వెంకాయమ్మ-వెంకటేశ్వర్లు
ఒంగోలు-ప్రకాశం

శ్రావ్య
2సం॥,జూన్-2007
వరలక్ష్మి-రామకృష్ణ
దామరచర్ల-నల్లగొండ

జి. నాని చరణ్ తేజ
3సం॥, జూన్-30
రేణుక-గోవర్ధన్
తంగదంచ-కర్నూలు

ఆర్. వర్షిత
1సం॥,జూన్-2008
మార్త- రాముడు
రాజోళి-మ॥నగర్

వృషికేశ్‌రెడ్డి
2సం॥, జూన్-2007
అంజలీదేవి-శంకర్‌రెడ్డి
మాదిరెడ్డిగారిపల్లె-కడప

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు, పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు, తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి
ప్లాట్ నెం. 21/1, ఎం.హెచ్ భవన్
అజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగం పల్లి,
హైదరాబాద్-500 020

బి. మహిమ
3సం॥, జూన్-29
సునీత-శ్రీనివాస్
రాజేంద్రనగర్-రాజమండ్రి

మనలో మాట

కాకమ్మా...మా అజ్ఞానాన్ని మన్నించు!



కాకి నేరం చేసింది. మొన్న శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆలయంలోకి ప్రవేశించింది. ఈ సంగతి తెలిసి వేదపండితులు విభ్రాంతి చెందారు. కాకి ప్రవేశం అరిష్టమని, అపచారమని, అపశకునమని ఏకకంఠాన ఉద్ఘోషించారు. వెన్వెంటనే నష్ట నివారణకు సంప్రోక్షణ (శుద్ధి) కార్యక్రమం చేపట్టారు!

పాపం... కాకికి ఈ సంగతులేం తెలీవు. కాబట్టి- పండితులు బతికిపోయారు.

లేకపోతే కాకలు తీరిన కాకిబలగం దండయాత్ర తథ్యమయ్యేది.

ఇదే కాదు; మన అదృష్టవశాత్తూ కాకికి చాలా విషయాలు తెలియవు. తెలిస్తే- మన పని అయ్యేదే! ఎందుకనో కాకి పట్ల మనకు గౌరవం లేదు. భక్తి లేదు. సానుభూతీ లేదు. బహుశా మన దేవుళ్లెవరికీ అది వాహనంగా లేదు. తన కాళ్ల మీద తాను నిలబడి తన బతుకేదో తాను బతుకుతుంది. ఈ వివక్షకు ఇదొక కారణం కావొచ్చు. నలుపు అంటే ఆర్యపుత్రులకు ఎందుకనో మొదటినుంచీ జడుపూ వెరపూ. మనుషులను విభజించినట్టే రంగు ప్రాతిపదికన పక్షిజంతుజాలాలనూ విడదీసి- ఉన్నతత్వాన్నీ, అల్పత్వాన్నీ ఆపాదించారు. ఆ 'వర్ణా'ంధతే ఇప్పటికీ కొనసాగుతోంది! మన పురాణాల్లో, పూజాధిక కార్యకలాపాల్లో ఆవుపాలకు ఉన్న ఔన్నత్యం గేదెపాలకు లేదు! కారణం 'వర్ణ' వివక్షే!

ఈ నేపథ్యంలో కాకి కూడా ఒక వర్గంలోకి వెళ్లగొట్టబడింది. అందుకనే- కాకి మన కథలనిండా ఉన్నప్పటికీ- ఎక్కువ సందర్భాల్లో అది విలన్ పాత్రలో ఉంటుంది. 'కాకి - పిచ్చుక' కథ వింటే పిచ్చుక మీద అభిమానమూ, సానుభూతీ కలుగుతాయి. కాకి అంటే కంపరం పుట్టుకొస్తుంది. కాకికి పూర్వీకుడనదగ్గ కాకాసురుడి కథ విన్నా ఇదే ఫీలింగు కలుగుతుంది.

అసలు దేవుడికన్నా కాకే అసలుసిసలైన సర్వాంతర్యామి. మనిషి మనిషికీ, దేశదేశానికీ దేవుడు మారతాడు. కాకి అలా మారదు. ఆఫ్రికా అడవుల్లోనూ, హైదరాబాదు నగరంలోనూ కాకి ఉనికి కచ్చితంగా కనిపిస్తుంది. కీకారణ్యంలోనూ, కాంక్రీటారణ్యంలోనూ బతగ్గలిగిన ఏకైక ప్రాణి కాకి ఒక్కటేనేమో!

మనం చూడగలిగితే- కాకిలో చాలా గొప్ప గుణాలున్నాయి. సంఘబలానికి, సమానత్వానికీ అది చక్కని ఉదాహరణ. ఎవడికి వాడు బతికే మనిషిలాంటి స్వార్థం కాకి డిక్షనరీలోనే లేదు. ఉన్నదాన్ని నలుగురూ పంచుకోవాలన్న సోషలిస్టు దృక్పథం దానిది. ఇంత తిండి దొరికితే చాలు, తోటి కాకులను రారమ్మని పిలుస్తుంది. కలిసి ఉంటే కలదు సుఖం అన్నది దాని థియరీ. ఈ లక్షణంవల్లే మనుషులు ఏకాకులుగా బతుకుతారుకానీ, కాకులు బతకవు. కాకిది సంఘజీవనం.

పాపం... కాకి ఎన్ని అవమానాలు ఎదుర్కొన్నా మన భాషను మాత్రం పరిపుష్టం చేసింది. పోలికలూ పదబంధాలూ, సామెతలూ జాతీయాలూ... ఇలా ఎన్నయినా కాకి లేనిదే కత లేదు. కాకిగోల, కాకమ్మ కథలు, కాకినలుపు, కాకుల్లా వచ్చిపడ్డారు, ఎంగిలి చేత్తో కాకిని కొట్టడు, కాకుల గుంపు, లోకులు పలుగాకులు.... ఇలా మన వ్యవహారంనిండా కాకి ప్రస్తావన ఉంది. కానీ, అన్నీ ఎకసెక్కపు మాటలే! అపహాస్యపు పోలికలే! కానీ, కాకి నొచ్చుకోకుండానే బతుకుతోంది. భాషకు బలాన్నిస్తోంది. ఆఖరికి పిండాన్ని తిని తిట్టిపోసిన పండితోత్తములకు సైతం ముక్తిని ప్రసాదిస్తుంది.

ఇన్ని సుగుణాలున్న కాకి ఆదర్శజీవే కానీ, అంటరాని జీవి కాదు;
మడీ శుద్ధీ అని ఎద్దేవా చేసేవాళ్లదే అల్పబుద్ధి!
పాపము శమించుగాక!

★

ఈ సంచికలో....

ఊహ	...	2
రుచి	...	3
సీరియల్	...	8
కవిత్వమ్	...	10
తెల్సా	...	11
బాల నేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
క్రైమ్ కథ	...	17
కథ	...	22
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4
గతం - వర్తమానం
కొనసాగింపు

విజ్ఞాన వీచిక ... 6
గాజుబిళ్లతో బయటపడ్డ
సూక్ష్మ ప్రపంచం



సమ్‌థింగ్ స్పెషల్... 18
నల్లా నల్లని పండు

ఆరోగ్యం ... 20
పిల్లలు
మానసిక సమస్యలు



విశేషంగా ఆకట్టుకున్న 'నూరేళ్ల శ్రీశ్రీ'

జూన్ 14 నాటి స్నేహ అట్టమీది కథగా జయప్రకాష్ అందించిన 'మన పార్లమెంటు'తో పాటు వివిధ పార్లమెంటుల చిత్రణ చక్కగా వివరించారు. విజ్ఞాన వీచిక ద్వారా ఎడిసిన్ మహనుభావుణ్ణి గుర్తుకు తెచ్చుకున్నాం. 'తెలుసుకుందామా' లో 'నూరేళ్ల శ్రీశ్రీ' అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. 'ఆరోగ్యం'లో డాక్టర్ దగ్గరకు వెళ్లేముందు ఏఏ జాగ్రత్తలు గైకొనాలో మాకవగతం అయింది. గని సీరియల్ ఆసక్తికరంగా సాగుతోంది. 'తెల్సా' ఫీచర్ సంచికకే మణిపూస వంటిది. "బాల నేస్తాలు"లో కదులుతున్నాయా? అంశం మాకెంతో నచ్చింది. "బూరల బొమ్మలు" ముద్దుముద్దుగా ఉన్నాయి. చూద్దామాలో హస్తకళలకు ప్రసిద్ధమయిన బీదర్‌ను సందర్శించగలిగాం. 'మనలోమాట' నివేదించిన లేఖ చదివి వానతల్లి అన్నదాతకు అండగా ఉండాలని మేముకూడా మనస్ఫూర్తిగా కోరుకున్నాం.

నేమాన సుభాష్‌చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

గుడ్డి నమ్మకం

అట్టమీది కథలో రుతుపవనాల గురించి అవగాహన కలిగించారు. 'కవిత్వమ్'లో రెండు కవితలూ భావగర్భితంగా వున్నాయి. ఆరోగ్యంలో చెప్పిన కంప్యూటర్ - జాగ్రత్తలు రోజువారీ జీవన విధానంలో ఎంతో ఉపయోగపడ్తాయి. 'చూద్దామా'లో లోథాల్ గురించి వచ్చిన వ్యాసం ఎంతో అపురూపమైనదిగా అనిపించింది. సొరకాయ బొమ్మలు బాగున్నాయి. 'మనలోమాట' చేపమందు ఒట్టి నమ్మకం కాదు అది మూఢ నమ్మకం, గుడ్డినమ్మకం కూడా.

సుభాష్, శ్రీకాకుళం.

కవర్ స్టోరీ బాగు బాగు

మన పార్లమెంటు గురించి కవర్ స్టోరీ బాగుంది. పార్లమెంటు భవన నిర్మాణం మొదలు అనేక అంశాలు వ్యాసం ద్వారా తెలుసుకున్నాం. దీనితో పాటు అమెరికన్ పార్లమెంటు, బ్రిటన్, ఈజిప్ట్ పార్లమెంట్ల గురించి కూడా తెలుసుకున్నాం. నూరేళ్ల శ్రీశ్రీ గురించి ఎక్కువ సమాచారంతో వ్యాసం బాగుంది. ఫొటోలు బాగున్నాయి. శ్రీశ్రీ శత జయంతి సందర్భంగా ఈ వ్యాసం ప్రచురించినందుకు ధన్యవాదాలు. సాహితీ లోకంలోనే కాక శ్రమ జీవులందరిలో శ్రీశ్రీ జీవించి వున్నారు. 'స్ఫూర్తి' అంశంలో కేశవరెడ్డిగారిని ప్రభావితం చేసిన గోర్కి రచన 'ది సిటీ ఆఫ్ ది ఎల్లో డెవిల్ (నగరం) గురించి విశదంగా తెలుసుకున్నాం.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖపట్నం.

చవులూరించే కంద రుచులు

షష్టిపూర్తి చేసుకున్న మన పార్లమెంటు విశేషాలు బాగున్నాయి. 1921 సంవత్సరాన నిర్మితమై 1927లో ఇర్విన్ ప్రారంభించడం ఒక చరిత్రే. ఆరు ఎకరాల్లో భవన నిర్మాణం, జాలీలు, గోళాలు ఎంతో అందాన్ని కల్గిస్తాయి. అక్కడ సందర్శనకు అవకాశం లభించడం కూడా భాగ్యమే. శ్రీశ్రీకి అప్పుడే నూరేళ్ళు నిండాయంటే ఆశ్చర్యంగా వుంది. కంద పురాణం వదలండి, కంద రుచులు చూడండి అనేట్టుగా ఉన్నాయి 'రుచి' వంటకాలు. బూరల బొమ్మలు చూస్తుంటే బూరల పండుగలాగే వుంది.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.



లైటు రేటు అదిరె

ఈ వారం విజ్ఞాన వీచిక మాకు బాగా నచ్చింది. బల్బుల గురించి, వాటి ఆవిర్భావం గురించి తెలుసుకున్నాం. కానీ రానున్న కాలంలో ఇప్పుడు వాడుకలో ఉన్న బల్బులు మాయమైపోయి కొత్తరకం వస్తాయంటే బాగానే ఉంది కానీ, వాటి రేటు చూస్తే కాస్త భయంగా కూడా ఉంది. అందరూ అంత రేట్లు పెట్టి వాటిని కొనగలరా అనిపిస్తుంది. అందులోనే కాలిఫోర్నియాలో వందేళ్ల పైగా ఒక బల్బు వెలుగుతోందంటే చాలా ఆశ్చర్యంగా వుంది. పుట్టిన రోజు కథ బాగుంది. చివరి పేజీలో బూరలు చూస్తుంటే చిన్నప్పటి రోజులు గుర్తొచ్చి చాలా ఆనందంగా అనిపించింది. ఇలా తమాషాగా వుండేవి మరెన్నో మాకు అందించాలని మా కోరిక.

విజయ్, గుంటూరు.

★





బెంగుళూరు మిర్చి చట్నీ

కావలసిన పదార్థాలు

బెంగుళూరు మిర్చి (క్యాప్సికమ్) - ఆరు
నువ్వులు - అరకప్పు, చింతపండు- పావుకప్పు
కారం- అరస్పూన్, ఉప్పు- తగినంత
జీలకర్ర - అర స్పూన్, ఆవాలు - అరస్పూన్
నూనె - సరిపడినంత, పసుపు - పావు స్పూన్
పంచదార - ఒక స్పూన్

తయారు చేసే విధానం

ముందుగా బెంగుళూరు మిర్చి కడిగి నాలుగు భాగాలుగా కట్ చేసి పెట్టుకోవాలి. ప్యాన్‌లో నూనెవేసి వీటిని వేయించి పెట్టుకోవాలి. నువ్వులను దోరగా వేయించుకోవాలి. చింతపండును వేడినీటిలో నానబెట్టుకోవాలి. తర్వాత వాటిని మిక్సీ వేసుకోవాలి. పంచదార కూడా వేసి మిక్సీ చేసుకోవాలి. మెత్తగా అయ్యాక తీసి ఆవాలు, జీలకర్ర పసుపుతో పోపు వేసుకోవాలి.





శనగపప్పు కారా

కావలసిన పదార్థాలు

శనగపప్పు - ఒక కప్పు
పచ్చిమామిడి తురుము - అర కప్పు
కారం - ఒక స్పూన్
ఉప్పు - తగినంత
నూనె - వేయించడానికి సరిపడా

తయారు చేసే విధానం

శనగపప్పును నీటిలో పోసి ఓపూట నానబెట్టుకోవాలి. ఆ తరువాత నీరు తీసేసి నూనెలో ఎర్రగా వేయించి తీయాలి. దానిలో పచ్చి మామిడి తురుము, పచ్చికొబ్బరి తురుము వేసి కారం, ఉప్పు కలిపి సాయంత్రం స్నాక్‌లా తింటే బావుంటుంది.

చల్లచల్లని కీరా దోస ఖీర్

కావలసిన పదార్థాలు

కీరా దోసకాయ గుజ్జు - రెండు కప్పులు
పాలు - నాలుగు కప్పులు
పంచదార - ఒక కప్పు

తయారు చేసే విధానం

కీరా దోసకాయలను ముందుగా కడిగి పైపొట్టు తీసేసి ముక్కలు చేసుకోవాలి. గింజలు తీసివేసి మిక్సీలో వేసి మెత్తగా ముద్ద చేసుకోవాలి. పాలను బాగా మరగించాలి. తర్వాత పంచదార కలిపి కాస్త చిక్కగా అయ్యే వరకు వుంచి దీనిలో తయారుగా వుంచుకున్న దోసకాయ గుజ్జును కలపాలి. మరి కొద్దిసేపు వుంచి దించుకోవాలి. చల్లారనిచ్చి దీనిని మిక్సీలో వేసి బాగా షేక్ చేసుకోవాలి. ఫ్రిజ్‌లో పెట్టి చల్లగా అయ్యాక అందరికీ సర్వ్ చేయాలి.



బూందీ కూర

కావలససిన పదార్థాలు

బూందీ - ఒక కప్పు, ఉల్లి తరుగు - అర కప్పు
కొత్తిమీర తరుగు - పావు కప్పు
కారం - అర స్పూన్, ఉప్పు - తగినంత
నూనె - పావు కప్పు, పసుపు - పావు స్పూన్

తయారు చేసే విధానం

ముందుగా శనగపిండిలో కొంచెం బియ్యపుపిండి వేసి ఉప్పు, కారం కలిపి బజ్జీల పిండిలా నీటితో కలపాలి. దీనిని బూందీ గరిటతో నూనెలో బూందీ వేసుకుని వేయించి తీయాలి. బూందీ ఇంట్లో తయారుగా వుంటే కూడా ఇలా కూర తయారు చేసుకోవచ్చు. ప్యాన్‌లో నూనె వేసి ఉల్లితరుగు వేసి వేయించి పసుపు కలిపి కారం, ఉప్పు వేసి వేయించి బూందీ వేయాలి. బాగా కలిపి కాస్త నీరు చల్లి మూత పెట్టి కొంచెం మగ్గనివాలి. కొత్తిమీర చల్లి దించుకోవాలి. ఇది అన్నంలోకి రుచిగా వుంటుంది.



- ప్రొ॥ అరిబండి ప్రసాదరావు
వ్యవసాయ శాస్త్రవేత్త

గతం - వర్తమానం - కొనసాగింపు



నా జీవితంపై అత్యంత ప్రభావం చూపిన పుస్తకం గురించి చెప్పమని అడిగినప్పుడు, ఎన్నో పుస్తకాలు చదివిన నేను, వెంటనే ఏ ఒక్క పుస్తకం పేరూ చెప్పలేకపోయాను. ఇందుకు కారణం మనల్ని ప్రభావితం చేసే అంశాలు ఎప్పుడూ ఒకే విధంగా ఉండవు. మన అనుభవం, అవసరాలను బట్టి మారుతుంటాయి. బాల్యంలో విద్యార్థిగా ఉన్నప్పుడు ఒక పుస్తకం నన్ను బాగా ఆకర్షిస్తే, రెండవ పుస్తకం మొదట ఆకర్షించిన అంశాలను సాధించుకునే మార్గం చూపెడుతుంది. ఈ పరిణామక్రమంలో మారుతున్న వాతావరణం, పరిసరాలు, చదివిన ఆ పుస్తకాలు మరోసారి చదువుతోంటే కొన్ని సందర్భాలలో నాకు సరికొత్త అర్థాలను ఇస్తున్నాయి. ఈ పుస్తకాలను గురించే ఈ రోజు చెబుతాను.

కమ్యూనిస్టు పార్టీ కుటుంబంలో నేరుగా పుట్టడంతో కమ్యూనిస్టు విలువలు నాపై చిన్నప్పటినుంచీ ప్రభావం చూపించాయి. చదువుకోవడానికి డబ్బులేని కాలంలో దాదాపు చదువంతా మెరిట్ స్కాలర్‌షిప్‌తో చదివినవాడ్ని. విశ్వవిద్యాలయస్థాయికి వచ్చేటప్పటికి రాబిన్‌హుడ్ సాహసకృత్యాల పట్ల ఆకర్షణ కొనసాగుతున్నా 1960 దశకం ప్రారంభంలోనే 'గతితార్కిక భౌతికవాదాన్ని' చదివాను. దీనిని ఇప్పటి సమాజ పరిస్థితులకు అన్వయిస్తూ పలు కోణాల నుంచి చర్చించే వారం. ఓ సినిమా చూస్తున్నట్టుగా మన గతాన్ని, వర్తమానాన్ని, భవిష్యత్తును అర్థం చేసుకోవడానికి ఇది గీటురాయి అయింది. నిత్యజీవితంలో దీనిని ఒక దిక్సూచిగా పెట్టుకుంటే సమాజాభివృద్ధికి (మన అభివృద్ధికి కూడా) తోడ్పడుతుందని ఈ చర్చల ద్వారా గ్రహించాను. ఈ అవగాహనతో అనేక విషయాలను స్నేహితులతో చర్చించాను. రాబిన్‌హుడ్ అనుసరించిన పద్ధతులు ఇప్పటి పేదలు, అణగారిన ప్రజల సమస్యలను తీర్చలేవని గ్రహించాను. రాబిన్‌హుడ్ సాహసం, కమ్యూనిస్టు విలువలు, చారిత్రక భౌతికవాదం ద్వారా నేర్చుకొన్న విజ్ఞానం, ఇతర అనుభవాలు నా ఆలోచనలను మార్చివేశాయి. వీటి ఫలితమే ఇప్పటి 'నేను'.

అధికారికంగా నా వయసు 67 సంవత్సరాలు. ఇలా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే నేను ఎప్పుడు పుట్టానో నాకే సరిగ్గా తెలియదు. మా అమ్మానాన్నలు చెప్పలేదు. దీనర్థం, అమ్మానాన్నలు చదువురానివారు లేదా చదువలేనివారు కాదు. మా నాన్న ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి, అప్పటి నిజాం రాజు అన్యాయాల్ని ఎదిరించడానికి కమ్యూనిస్టు పార్టీలో చేరి అడవిలోకి పోయినాడు. నేను పుట్టిన కొన్నినెలలకే మా అమ్మ నన్ను అమ్మమ్మ తాతయ్యల దగ్గర వదిలేసి మా నాన్న లక్ష్యానికే అంకితమై అడవులకు వెళ్లిపోయింది. నే పుట్టినతేదీని వారు అంత ప్రాధాన్యత గలిగిన అంశంగా భావించలేదు. ఇదే నా పుట్టిన తేదీ కచ్చితంగా తెలియకపోవడానికి ప్రధానకారణం. ఇదే సమయంలో రికార్డులూ తగలబడిపోయాయి. అందువల్ల సరైన పుట్టినతేదీని ఆ తర్వాత కూడా తెలుసుకోలేకపోయాను. అమ్మమ్మ తాతయ్యలు మంచి భక్తులు. రోజూ పూజ చేసేవారు. మా అమ్మమ్మ నాకు దేవుళ్ల కథలెన్నో చెప్పేది. కానీ నాకు అమ్మానాన్నలే హీరోలు, మార్గదర్శకులు. రహస్యంగా ఉన్న మానాన్నను నాకు రెండుసార్లు చూపించారు. ఇది ఎల్లప్పుడూ జ్ఞాపకం ఉంచుకునే అంశం.

ఈ వాతావరణంలో పెరిగిన నేను చిన్నప్పుడు కథలను బాగా, ఇష్టంగా చదివేవాడ్ని. వీలున్నప్పుడల్లా గ్రంథాలయానికి వెళ్లి చందమామ, బాలమిత్రలను చదివేవాడ్ని. ఆ కథలిప్పుడు గుర్తుకు రావడంలేదు. కానీ అప్పుడు చదివిన ఉపవాచకంలోని 'రాబిన్ హుడ్' కథ (పూర్తిపాఠం జె వాకర్ మెస్పాడెన్) ఇప్పటికీ గుర్తుంది. కాకపోతే అన్ని వివరాలూ గుర్తులేవు. క్లాసూ గుర్తుకు రావడంలేదు. కొద్దికాలం క్రితం నేను యూకె (ఇంగ్లండ్) వెళ్లాను. కారులో వెళ్తోంటే మా అబ్బాయి ఒక అడవిని చూపించి "నాన్నా! ఇదే

షేర్‌వుడ్ ఫారెస్ట్. రాబిన్‌హుడ్ ఇక్కడే ఉండేవాడు. ఆయన పేరుమీద ఒక కౌంటీ (జిల్లా) కూడా ఉంది. ఇదొక పర్యాటక కేంద్రం కూడా" అని చెప్పాడు. వెంటనే నాకు రాబిన్‌హుడ్ కథ గుర్తుకువచ్చి పులకించిపోయాను. కొద్ది సమయం ఉన్నా అక్కడికి వెళ్లి చూసేవాడ్ని. కానీ ఆ అవకాశం కలగలేదు.

ఇంతకీ రాబిన్‌హుడ్ పుస్తకం ఎందుకు నన్ను (అప్పుడు) అంతగా ఆకర్షించింది? అసలు రాబిన్‌హుడ్ అనే వ్యక్తి ఉన్నాడా! లేక ఆయన కథలు కల్పితమా?! అనేదానిమీద ఇంగ్లాండ్‌లోనే చర్చోపచర్చలు కొనసాగుతున్నాయి. ఇప్పుడున్న సమాచారం ప్రకారం దాదాపు 700 సంవత్సరాల క్రితమే (13వ శతాబ్దంలలో) రాబిన్‌హుడ్ పోరాటాలను, సాహసకృత్యాలను కథలుకథలుగా జనం చెప్పుకునేవారట. తర్వాత ఇది పుస్తక రూపం తీసుకొంది.

అది రాచరిక కాలం. ఆ కాలంలోనే తనకు అన్యాయం జరిగినప్పుడు రాబిన్‌హుడ్ సహించకుండా అధికారాన్ని ఎదిరించాడు. శత్రువులను చంపాడు. రాజుచే బహిష్కృతుడయ్యాడు (ఔట్‌లా). తన శత్రువు కూతుర్ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ధనికులను కొల్లగొట్టి పేదల అవసరాలను తీర్చాడు. కష్టాల్లో ఉన్నవారికి కోరిన సాయం అందించాడు. చిన్నవయసులో ఉన్న నాకు రాబిన్‌హుడ్‌కూ, అధికారాన్ని ఎదిరించి... అన్యాయాన్ని ఎదిరించడానికి ఆయుధం పట్టి అడవికి పోయిన మా అమ్మానాన్నలకూ తేడా కనిపించలేదు. అందుకనే రాబిన్‌హుడ్ కథ నాకు అప్పట్లో ఎంతో స్ఫూర్తినిచ్చింది.

రాబిన్‌హుడ్ రోజుల్లో రెండవ హెన్రీ రాజు వేటాడటానికి, మాంసజంతువులను సరఫరా చేయడానికి ప్రత్యేకమైన అడవులు ఉండేవి. దీనిలో షేర్‌వుడ్ అనే ప్రాంతపు అడవి కూడా ఉండేది. ఈ అడవిలో ఇతరులెవరైనా జంతువులను వేటాడితే లేదా చంపితే వారికి మరణశిక్ష విధించేవారు. ఈ అడవికి రాబిన్‌హుడ్ తండ్రి ముఖ్యాధిపతి. ఈయనకు నాటింగ్‌హేం షరీఫ్, హెర్‌ఫోర్డ్ అనే చర్చి బిషప్, హంటింగ్టన్ ఎర్ల్ (అధికారి)కి ఫిజ్ వాల్టర్ శత్రువులు. వీరందరూ రాజును ప్రభావితం చేసి రాబిన్‌హుడ్ తండ్రిని షేర్‌వుడ్ అటవీప్రాంతపు ముఖ్యాధికారి పదవి నుంచి తొలగిస్తారు. కొన్ని నెలలకే రాబిన్‌హుడ్ తల్లి అనారోగ్యంతో చనిపోతుంది. ఆ తర్వాత కొన్ని వారాలకే తండ్రికూడా మరణిస్తాడు. దీనితో రాబిన్‌హుడ్ సర్వం కోల్పోతాడు. తన సర్వస్వం కోల్పోవడానికి కారణమైన వారిపై పగ తీర్చుకోవాలనుకుంటాడు. ఆ తర్వాత అడవిలో ఎన్నో కారణాలతో తనలాగే బహిష్కృతులైన ఒక గుంపుకు నాయకుడుగా చేరతాడు. రాబిన్‌హుడ్ నాయకత్వాన ఈ గుంపు ఎంతోమంది ధనికులను కొల్లగొట్టి, పేదలకు పంచుతుంది. శత్రువులపై సాహసంతో పగ తీర్చుకుంటాడు. స్త్రీలకు ఎట్టిపరిస్థితుల్లోనూ హానిచేయడు. వారిని ఎప్పుడూ గౌరవించేవాడు. ఎవర్నీ మోసం చేయడు. అధికారాన్ని ఎదిరిస్తాడు... ఇలా రాబిన్‌హుడ్ సాహసాలను, మంచి పనులను ప్రజలు కథలు కథలుగా చెప్పుకొంటున్నారు.

కమ్యూనిస్టు పార్టీ కుటుంబంలో నేరుగా పుట్టడంతో కమ్యూనిస్టు విలువలు నాపై చిన్నప్పటినుంచీ ప్రభావం చూపించాయి. చదువుకోవడానికి డబ్బులేని కాలంలో దాదాపు చదువంతా మెరిట్ స్కాలర్‌షిప్‌తో చదివినవాడ్ని. విశ్వవిద్యాలయస్థాయికి వచ్చేటప్పటికి రాబిన్‌హుడ్ సాహసకృత్యాల పట్ల ఆకర్షణ కొనసాగుతున్నా 1960 దశకం ప్రారంభంలోనే 'గతితార్కిక భౌతికవాదాన్ని' చదివాను. దీనిని ఇప్పటి సమాజ పరిస్థితులకు అన్వయిస్తూ పలు కోణాల నుంచి చర్చించే వారం. ఓ సినిమా చూస్తున్నట్టుగా మన గతాన్ని, వర్తమానాన్ని, భవిష్యత్తును అర్థం చేసుకోవడానికి ఇది గీటురాయి అయింది. నిత్యజీవితంలో దీనిని ఒక దిక్సూచిగా పెట్టుకుంటే సమాజాభివృద్ధికి (మన అభివృద్ధికి కూడా) తోడ్పడుతుందని ఈ చర్చల ద్వారా గ్రహించాను. ఈ అవగాహనతో అనేక విషయాలను స్నేహితులతో చర్చించాను. రాబిన్‌హుడ్ అనుసరించిన పద్ధతులు ఇప్పటి పేదలు, అణగారిన ప్రజల సమస్యలను తీర్చలేవని గ్రహించాను. రాబిన్‌హుడ్ సాహసం, కమ్యూనిస్టు విలువలు, చారిత్రక భౌతికవాదం ద్వారా నేర్చుకొన్న విజ్ఞానం, ఇతర అనుభవాలు నా ఆలోచనలను మార్చివేశాయి. వీటి ఫలితమే ఇప్పటి 'నేను'.

ఇప్పటి ప్రపంచీకరణ శ్రామికులపై ఎనలేని భారాలను మోపుతోంది. ఇది అన్యాయపూరితమైంది. అత్యధిక ప్రజలు తమ జీవనస్థాయిని కోల్పోతున్నారు. అభద్రతకు లోనౌతున్నారు. ప్రజల శ్రమ, దేశ సంపద పెద్ద ఎత్తున ఏదో ఒక పేరుతో కొల్లగొట్టబడుతోంది. కొల్లగొట్టడాన్ని సానుకూలం చేయడానికి, పాలకవర్గం నగ్నంగా పాతచట్టాలను మార్చడమో, లేదా కొత్త చట్టాలను, నియమ నిబంధనలను ఏర్పాటు చేస్తున్నారు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలను ఏమాత్రం పట్టించుకునే స్థితిలో వీరులేరు. అతి కొద్దిమంది చేతిలో సంపద పోగుపడుతోంది. మనదేశంలో పేదరికం, నిరుద్యోగం, అభద్రత పెరుగుతోంది. వీనిని ప్రజలు ఎల్లకాలం సహిస్తారనుకోవడం అశాస్త్రీయం. సామాజిక న్యాయం నిలదొక్కుకొని బలపడుతుంది. ఇది గతం నుంచి నేర్చుకునే పాఠం.

ఈ పరిస్థితుల్లో గతితార్కిక భౌతికవాదమే దిక్సూచి. ఇది వచ్చే మార్పులకు కూడా దిక్సూచి. ఇప్పటి ప్రపంచ ఆర్థిక సంక్షోభం, సోవియట్ యూనియన్ పరిణామాలు, కొత్త సమాజ రూపురేఖలను సూచనమాత్రంగా తెలియజేస్తున్నాయి. ఉన్నతదశకు సమాజం మారక తప్పదు. ఈ మార్పు కొనసాగుతూనే ఉంటుంది. దోపిడీ రహిత సమాజమే అంతిమదశ. ఇది చరిత్ర చెపుతున్న వాస్తవం. దీన్ని అందరం అంగీకరించాల్సిందే కదా!

★

ఇప్పటి ప్రపంచీకరణ శ్రామికులపై ఎనలేని భారాలను మోపుతోంది. ఇది అన్యాయపూరితమైంది. అత్యధిక ప్రజలు తమ జీవనస్థాయిని కోల్పోతున్నారు. అభద్రతకు లోనౌతున్నారు. ప్రజల శ్రమ, దేశ సంపద పెద్ద ఎత్తున ఏదో ఒక పేరుతో కొల్లగొట్టబడుతోంది. కొల్లగొట్టడాన్ని సానుకూలం చేయడానికి, పాలకవర్గం నగ్నంగా పాతచట్టాలను మార్చడమో, లేదా కొత్త చట్టాలను, నియమ నిబంధనలను ఏర్పాటు చేస్తున్నారు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలను ఏమాత్రం పట్టించుకునే స్థితిలో వీరులేరు. అతి కొద్దిమంది చేతిలో సంపద పోగుపడుతోంది. మనదేశంలో పేదరికం, నిరుద్యోగం, అభద్రత పెరుగుతోంది. వీనిని ప్రజలు ఎల్లకాలం సహిస్తారనుకోవడం అశాస్త్రీయం. సామాజిక న్యాయం నిలదొక్కుకొని బలపడుతుంది. ఇది గతం నుంచి నేర్చుకునే పాఠం.

విజ్ఞాన వీచిక



గాజుబిళ్లతో బయటపడ్డ సూక్ష్మ ప్రపంచం

మైక్రోస్కోపు వాడుకలోకి వచ్చిన తర్వాత జీవకణ నిర్మాణం అర్థమైంది. జీవకణాలు నిర్వహించే జీవక్రియలు అర్థమైనాయి. వాతావరణంలో ఒక పెద్ద సూక్ష్మజీవుల ప్రపంచం ఉందని అర్థమైంది. అలాగే రోగాలు వ్యాపించడానికి సూక్ష్మజీవులే కారణమని కూడా అర్థమైంది. వైద్య రంగంలో, జీవశాస్త్ర పరిశోధనా రంగంలో మైక్రోస్కోపు అనూహ్యమైన మార్పులు తెచ్చింది. ఆంటన్ వాన్ లీవెన్‌హాక్ (1632 -1723) జీవితంలోకి తొంగి చూస్తే, ఆయన మైక్రోస్కోపును ఎలా ఆవిష్కరించాడో, దానివల్ల మానవాళికి ఎంత మేలు జరిగిందో అర్థం చేసుకోవచ్చు.

- డాక్టర్ దేవరాజు మహారాజు

(ఒక యువకుడు బండమీద గాజు ముక్కకు పదును పెడుతుంటాడు)

ఆంటన్: హూం.. హూ...హూం

దుకాణదారుడు : ఆంటన్... ఆంటన్! ఓహో - నీకు ఎప్పుడూ ఆ అద్దాలు రుద్దేపనేనా?

ఆంటన్: చూడండి సార్. ఈ అద్దపు బిళ్లను ఎలా మార్చేశానో... కంటికి కనిపించని అతి సూక్ష్మమైనవి కూడా ఇందులోంచి చూస్తే కనిపిస్తాయి.

దుకాణదారుడు : ఆం..ఆం... అలాంటి పనికిమాలిన పనులు తప్ప, నీకు మంచి పనులు చేయడం తెలియదు. బట్టల కొట్టులో సేల్స్ పెంచవయ్యా ఆంటన్. ఇప్పుడీ అద్దపు బిళ్లలెవడిక్కావాలి?

ఆంటన్: అలా కాదు సర్. మనకు దీనితో చాలా పనుంది. మనకు వచ్చే బట్టల తాన్లలో నాణ్యమైనవి ఉన్నాయో లేదో తెలుసుకోవచ్చు.

దుకాణదారుడు: అదెలా?

ఆంటన్: ఇదిగో ఈ గుడ్డ నేత(టెక్చర్) మనకు సరిగా కనబడడంలేదు కదా? దీన్ని ఈ కటకంలోంచి చూడండి. కటకమంటే మరేమో కాదు. ఓ రకమైన అద్దంబిళ్ల.

దుకాణదారుడు : (ఆశ్చర్యపోతూ) అరెరె... అతి సన్నని దారం పోగులు ఎంత పెద్దగా కనిపిస్తున్నాయో! ఎంత విచిత్రంగా ఉంది. ఆంటన్... నేను ఏమో అనుకున్నాను. నీది మహా గట్టి బుర్ర సుమా! చిన్నవి పెద్దగా చేసుకుని చూడవచ్చని నాకు తెలియనే తెలియదు. ఇలా చూడడం జీవితంలో ఇదే మొదటి సారి. చాలా తమాషాగా ఉంది ఆంటన్. అయితే పనిలో పని. ఓ పని చేసి పెట్టవయ్యా. మనకి కొత్తగా వచ్చాయి చూడు. ఆ తానులన్నీ ఓ సారి అద్దం బిళ్లతో పరీక్షించు. నాణ్యమైనవో కావో... మనకిక్కడ షాపులో అమ్ముడవుతాయో లేదో ... ఆంటన్ మనం ఇంకో పని కూడా చెయ్యొచ్చు. మన కష్టమర్లకు గుడ్డలు ఈ అద్దం బిళ్లతో చూపించి చాలా నాణ్యమైనవని వారికి నమ్మకం కలిగించవచ్చు. ఇతర షాపులకన్నా మన షాపుకు గిరాకీ ఎక్కువౌతుంది. ఏమంటావ్?

ఆంటన్: అవును సర్. అందుకే కదా రాత్రింబవళ్లు కష్టపడి అద్దంబిళ్లల్ని అంటే కటకాల్ని తయారు చేశాను.

దుకాణదారుడు : (నవ్వుతూ) భలే భలే! నీ దూరదృష్టి అమోఘం ఆంటన్. ఆం నేను కాస్త బయటి పనులు చూసుకొస్తాను. నువ్వు షాపు చూస్తుండు. అలాగే నీ తోటి వాళ్లను కూడా చూస్తుండు. ఎక్కడి వాళ్లక్కడే నిద్రపోతారు బద్ధకస్తులు. సేల్స్ జరగనీయండి. (వెళ్లిపోతూ) జాగ్రత్త ఆంటన్.

ఆంటన్: సరే సర్. మీరు నిశ్చింతగా వెళ్లిరండి. అమ్మకాల విషయంలో మీరేమీ బెంగ పెట్టుకోవద్దు. కష్టమర్లను సంతోషపరిచి ఎలాగో బట్టలు అమ్మేస్తాం. (స్వగతంలో) హమ్మయ్య వెళ్లిపోయాడు. శనిగాడు. సేల్స్ సేల్స్ అని ఛస్తాడు. మరో లోకమే లేదు...

సహచరుడు : ఆంటన్ ఏంటది? మన సేట్ గారికి చూపెడుతున్నావ్.

ఆంటన్: ఊం కంటికి కనబడనివన్నీ చూపెడుతున్నాను.

సహచరుడు : కంటికి కనబడనివా? నీ చోద్యం గానీ, అదెలా సాధ్యం (హేళనగా నవ్వు). అయినా ఒక్కోసారి కళ్లముందున్నదే కనబడదూ. ఇక కంటికి కనబడనిది ఎలా చూపెడతావ్? ఇదేమన్నా మహిమా? దివ్యదృష్టా?



ఆంటన్ వాన్ లీవెన్‌హాక్



ఆంటన్: ష్... షటప్! పిచ్చి పిచ్చిగా వాగకు. చూడాలని ఉంటే వచ్చి చూడు. లేకపోతే వెళ్లి నీపని చూస్కో.

సహచరుడు : ఆఁ ఏంటి ఆంటన్ అలా సీరియస్ అయిపోతావ్? మన సేటు గారే చంకలెగరేసుకుంటూ చూశారు. సరే అదేమిటో నేనూ చూస్తా.

ఆంటన్ : అయితే అలా నిలబడు. చూపిస్తా.

సహచరుడు : సరే... అలాగే ఆంటన్.

ఆంటన్ : చూడు. ఇది కటకం. అంటే ఒక రకమైన గాజుబిళ్ల అనుకో. దీనిలోంచి చూస్తే కంటికి కనబడని అతి సూక్ష్మమైన వస్తువులు, జీవులు కనిపిస్తాయి.

సహచరుడు : అతి సూక్ష్మమైన జీవులా? ఏనుగులు, గాడిదలు, ఈగలు, దోమలు, అన్నీ కంటికి కనిపిస్తున్నాయి కద బాస్. ఇంకా కనబడని జీవరాసులెలా ఉంటాయ్?(ఎగతాళిగా)

ఆంటన్ : మళ్లీ మొదలు పెట్టావా? వెళ్లు! నీకక్కరలేకపోతే వెళ్లి ఆ బట్టల తాన్లన్నీ చుట్టుకో ఫో.

సహచరుడు : చుడతాలేవయ్యా స్వామీ! చుట్టక ఛస్తానా? ముందు ఆ విచిత్రమేదో చూపెట్టు.

ఆంటన్ : విచిత్రమే మరి. ఇక్కడ ఒక నీటి బిందువు ఉంది చూశావా?

సహచరుడు : ఆఁ చూశాను.

ఆంటన్ : దాంట్లో నీకేం కనిపిస్తోంది?

సహచరుడు : (పగలబడి నవ్వుతూ) దాంట్లో... దాంట్లోనా? ఏనుగులు, సింహాలు, పులులు.

ఆంటన్ : ఆఁ... ఇప్పటికి తెలిసిందా నా తాపత్రయమేమిటో. ఈ కటకం మానవ చరిత్రలో ఒక గణనీయమైన మార్పును తెస్తుంది. మనం తాగే నీటిలో, పాలలో, మన శరీరంలోని రక్తంలో, చుట్టూ ఉన్న వాతావరణంలో ఉన్న సూక్ష్మజీవులేమిటో తెలుసుకోవచ్చు. ఎలాగూ నేను చూసిన సూక్ష్మజీవుల వివరాలు నోట్సు రాస్తున్నాను. రాగల కాలాల వారికి ఉపయోగపడ్తాయి. ఏంటలా బిత్తరపోయి చూస్తున్నావ్?

సహచరుడు : (తేరుకుని) ఆఁ ఏమీలేదు ఆంటన్ వాన్ లీవెన్‌హాక్ మహాశయా! నీకో నమస్కారం. ఇప్పటి నుండి మిమ్మల్ని సర్ అని పిలవక తప్పదు. నాతోపాటు కొట్టులో పనిచేసేవాడివే కదా, నాకు తెలియని గొప్ప విషయాలేం చెబుతావని చులకనగా మాట్లాడాను. రియల్లీ ఐ యామ్ వెరీ వెరీ సారీ. నువ్వేమీ అనుకోకపోతే ఒక్క విషయం చెప్పు. ఈ గాజుబిళ్లను ఇలా కటకంలా తయారు చేయాలని, ఇలా కటకంలోంచి చూస్తే సూక్ష్మజీవులన్నీ స్పష్టంగా కనిపిస్తాయినీ... నీకెలా తోచింది ఆంటన్?

ఆంటన్ : ఆ కటకం మొదట తయారు చేసింది నేను కాదు. అతి పురాతన కాలంలో అస్సిరియాలో నిమ్రాడ్ రాజభవన శిథిలాల్లో మూడు కటకాలు దొరికాయి. వాటిని ఎవరు తయారు చేశారు, ఎందుకు చేశారు అనేది ఎవరికీ తెలియదు.

సహచరుడు: అదేమిటి? కటకం మొదట తయారు చేసిందెవరో ఎవరికీ తెలియదా?

ఆంటన్ : ఉహూఁ తెలియదు. ఆ తర్వాత, రోమన్ చరిత్రకారుడు సెనికా క్రీస్తుశకం 63వ సంవత్సరంలో ప్రపంచానికి ఒక కొత్త విషయం చెప్పాడు. గోళాకారంలో ఉన్న నీళ్లగాజు పాత్రలోంచి వస్తువుల్ని చూస్తే, అతి పెద్దగా కనిపిస్తాయిని చెప్పాడు. ఆ విషయమే నా మెదడును తొలిచింది. మామూలుగా సమతలంగా ఉండే గాజు బిళ్లను ఉబ్బెత్తుగా తయారు చేస్తే అది కటకంగా తయారవుతుంది. ఆ కటకంలోంచి చూస్తే అతి సూక్ష్మమైనవి కూడా కంటికి కనబడతాయని మనమిప్పుడు గ్రహించాం. ఏమంటావ్?

సహచరుడు : రోమన్ చరిత్రకారుడు సెనికా – 63వ సంవత్సరంలో ఈ కొత్త విషయం చెప్పాడని అంటున్నావు కదా? ఏ అరవై మూడు? ఇప్పటి ఈ పదహారువందల అరవైమూడా?

ఆంటన్ : (నవ్వి) కాదు మిత్రమా! ఉట్టి అరవై మూడే. క్రీస్తు శకం 63. అంటే ఇప్పటికి వెయ్యి సంవత్సరాలకు పూర్వం.

సహచరుడు : అది సరే... మరి ఇప్పుడు నువ్వేమిటి ఈ ఇనుపకడ్డీలు, మరలు తెచ్చావు. ఈ కటకాలకు వీటికీ ఏమైనా సంబంధం ఉందా?

ఆంటన్ : అవునోయ్ అవును. సంబంధం ఉంది. ఈనీటి చుక్కకు కటకం ఒక నిర్ణీతమైన దూరంలో ఉన్నప్పుడే అందులోని సూక్ష్మజీవులు కనిపిస్తున్నాయి. కటకాన్ని దూరం జరిపినా, దగ్గరగా జరిపినా తేడా వస్తోంది. నీటిలోని జీవులు కనిపించడం లేదు. అవునా? అందుకని, ఈ ఐరన్ ఫ్రేం తయారు చేసి, లెన్స్‌ను దానికి బిగించాను. కటకం అంటే లెన్స్ పైకి కిందికీ కదిలేట్టుగా ఈ మర – స్క్రూ బిగించాను. ఇప్పుడేమైందీ?

సహచరుడు : ఆఁ అర్థమైంది. తిరకాసంతా ఈ స్క్రూలో పెట్టావన్నమాట! ఈ స్క్రూ సవరిస్తే లెన్స్ పైకి కిందకీ కదులుతుందన్న మాట. అలా మూవ్ అవడం వల్ల ఫైన్ అడ్జస్ట్‌మెంట్ చేసి ఆబ్జక్ట్‌ని ఫోకస్ చేసుకోవచ్చు.

ఆంటన్ : అదీ! విషయం గ్రహించావ్ సంతోషం. అయితే అతి సూక్ష్మమైన వాటిని కూడా దర్శింప జేస్తోంది కనుక నేను తయారు చేసిన ఈ పరికరాన్ని 'సూక్ష్మదర్శిని' అని అంటే ఎలా వుంటుంది? అని ఆలోచిస్తున్నాను.

సహచరుడు: సూక్ష్మదర్శిని... మైక్రోస్కోప్.బ్రహ్మాండగా ఉంటుందయ్యా ఆంటన్. గో ఎ హెడ్. మానవాళికి ఒక కొత్త సత్యాన్ని ఆవిష్కరించిన మహనీయుడు ఆంటన్ వాక్ లీవెన్‌హాక్ అని విజ్ఞాన శాస్త్ర చరిత్రలో నీ పేరు కలకాలం నిలుస్తుంది. కంటికి కనిపించని జీవ ప్రపంచాన్ని లోకానికి సాక్షాత్కరింపచేసిన ఈ పదిహేడవ శతాబ్దపు శాస్త్ర వేత్తలతో నువ్వూ ఒకడిగా నిలుస్తావు. అయితే ఆంటన్ నువ్వు నన్ను తక్షణం క్షమించాలి. పొట్టకూటి కోసం బట్టల కొట్టులో పనిచేసే ఒక సేల్స్‌మెన్ ఒక కొత్త సూక్ష్మజీవుల ప్రపంచాన్ని దర్శింప చేస్తాడని... నామట్టి బుర్రకు తట్టలేదయ్యా! క్షమించు.

దుకాణదారుడు : (దూరం నుండి కేక) ఆఁ.. ఆంటన్ ఏం చేస్తున్నారు? తాన్లన్నీ చూసేశారా? దారప్పోగులు తెగినవి, దెబ్బతిన్నవి, చెడిపోయినవి ఏమీ లేవుకదా?

సహచరుడు : ఆఁ.. ఆఁ... ఆంటన్ ఆపనిలోనే ఉన్నాడు సర్. నేనాయనకు సహాయం చేస్తున్నాను. ★



సీరియల్

గని



జరిగినకథ:

బికాస్ తిరిగి ఉద్యోగంలో చేరాలనుకుంటాడు. కార్మికులకోసం ఉద్యమించి గాయపడిన అతడికి సోదరి దగ్గరుండి సేవలు చేస్తుంది. ఎప్పుడూ సమ్మెలూ, గొడవలూ కాకుండా నచ్చిన పిల్లను పెళ్లి చేసుకోమని కోరుతుంది. గనిలో పనిచేసి వస్తున్న కార్మికుల దగ్గర వడ్డీ వసూలు చేయడానికి రుణదాతలు బయట కాపలా కాస్తుంటారు. ఓ కార్మికుడికి రావాల్సిన దానికంటే తక్కువ జీతం వస్తుంది. తనకు డబ్బులు బట్వాడా చేస్తున్న అతడ్ని అదే అడుగుతాడతను. దానికతను పోయినవారం ఇంజనీరుతో గొడవపడినందుకంటాడు. అప్పుడు జరిగినదంతా గుర్తుకొస్తుందతనికి. ఆ తర్వాత...

తమిళ మూలం : కె. చిన్నప్పభారతి

అనువాదం : వి. వెంకటేశ్వర

(పదమూడవ భాగం)

అతడి జవాబు వినడమేగాక ముఖ కవళికలను బట్టి అతడి భావాల్ని గ్రహించాడు కాబోలు, ఇంజనీరు కోపగించుకున్నాడు. తన ఆజ్ఞను ధిక్కరించడమా? అతడిలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. "నేను చెప్పిన పని చెయ్ ముందు, పై అధికారుల పట్ల ఎలా మెలగాలో నేర్చుకో" అన్నాడు.

భోజన విరామ సమయం దగ్గర పడుతోంది. ఇంకా తొట్టె నిండలేదు. అప్పుడే కాళ్ళ, చేతులు తిమ్మిరెక్కాయి. మధ్యాహ్నం లోపల తొట్టె నింపకపోతే, సాయంత్రానికి పని పూర్తవకుండా కొంత మిగిలిపోతుంది. అలా జరిగితే కూలి డబ్బులు రావు. ఒక రోజు శ్రమ వృధా అవుతుంది.

అతడి జట్టులో అయిదుగురు ఉన్నారు. ముందు ఈ అదనపు పని చేస్తూ కూచుంటే, అసలు పని ముందుకు సాగదని వాళ్ళందరి భావన. అందుకే అందరూ మౌనంగా నిలుచున్నారు. ఇంజనీరు స్థూలకాయుడితో "ఒరేయ్! నీళ్ల తొలగించకుండా మీ పని మొదలు పెట్టడానికి వీల్లేదు" అని అధికారదర్పంతో ఆదేశించి, తన ఆదేశం అమలవుతుందో లేదో చూడ్డానికన్నట్లు అక్కడే నిలబడ్డాడు.

వాళ్ళేం చేయగలరు? సింహం సైతం రింగ్ మాస్టర్‌కు లోబడి ఉన్నట్లు, ఆకలిదప్పులు తీర్చుకోవడం కోసం అధికారుల మాటల్ని శిరసావహించక తప్పదు. చేసిన పనికి కూలి డబ్బులివ్వకపోయినా, చేయలేని పనులు చేయమని పురమాయించినప్పుడు, చేయకపోతే శిక్ష విధించినా మౌనంగా భరించక తప్పదు. నుదుటి రాత అని సరిపెట్టుకుంటారు. ఆర్థికంగా ఆధిపత్యం వహించే వాళ్ళు విధివిధానాలను తమకు అనుకూలంగా మలచుకుంటారు. లేని వాళ్ళు హరిత స్వప్నాలకు, స్వతంత్ర ఆలోచనలకూ నోచుకోలేకపోతున్నారు.

బతుకు తీపి అన్ని బాధల్నీ భరింపజేస్తుంది కాబోలు! సుందర ప్రాకృతిక దృశ్యాలూ, సజీవ మానవ సంబంధాలు, వేదనల్ని దూరం చేస్తాయి కాబోలు! మునిలాల్ తటపటాయిస్తూ, భయపడుతూ తన నిస్సహాయతను వ్యక్తంచేశాడు.

"సార్ ఆకలితోనూ, అలుపుతోనూ కళ్లు మూతపడుతున్నాయి. దయచేసి మన్నించండి" అంటూ కాళ్ళు పట్టుకున్నాడు.

యజమాని రెండడుగులు దూకమంటే, పెంపుడు కుక్క నాలుగడుగులు దూకడం లోక సహజం. కార్మికులను కట్టడి చేయడంలో తాము ఎవ్వరికీ తీసిపోమని నిరూపించుకోవడం కోసం తహతహలాడే ఇంజనీరు ఇలా అన్నాడు.

'చేతకాని దద్దమ్మలకు ఇక్కడ పనిలేదు. చెయ్యమన్న పని చేసి తీరాల్సిందే'

వాళ్ళు కిమ్మనకుండా అతడి ఆదేశాన్ని పాటించారు. అందువల్ల తొట్టె నింపలేకపోయారు. అందువల్ల ఒక రోజు కూలి ఎగనామం పెట్టడంతోబాటు, ఎదురు తిరిగినందుకు జరిమానా విధించారు. అతడేమీ మాట్లాడలేదు. లోలోపల కుమిలిపోయాడు. 'తండ్రీ! నన్నెందుకు పుట్టించావు' అని బ్రహ్మదేవుడ్ని నిందించాడు. బొగ్గు మసి నిండిన చేతులతో కన్నీళ్ళు తుడుచుకుంటూ బయటికి నడిచాడు. అప్పులవాళ్ళు చుట్టుముట్టారు. పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టయ్యింది అతని పరిస్థితి. తన చేతుల్లోని డబ్బుల్ని వాళ్ళకు పంచేసి, ప్రతి నెలా చెల్లించినట్లుగా ఈ నెల చెల్లించలేక పోతున్నందుకు గల కారణాన్ని వివరించాడు. "మీరు కనికరించి, ఈ నెల కనీసం ఒక పూట గంజి తాగడానికి వెసులుబాటు కల్పించకపోతే కనిపించని దూరాలకు పారిపోక తప్పదు, గత్యంతరం లేదు" అంటున్నప్పుడు అతడి గొంతు జీరబోయింది.

అతడు ప్రతి నెలా క్రమం తప్పకుండా అప్పు తీర్చేవాడు అనుకోనివిధంగా సమస్య వచ్చి పడినందువల్ల అప్పులవాళ్ల దగ్గర ఇలా వాపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. "ఇందుకు సగం మేమేం తీసుకొని మిగతా సగం నీకే ఇస్తాం. మరి బాకీని ఎలా తీరుస్తావు" అని అడిగాడొకడు.

అతడు చిన్న పిల్లాడిలా ఏడుస్తూ "ఈడొచ్చిన పిల్లకు మంచి చీర కొందామని నెలనెలా దాచిపెడుతూ కూడబెడుతున్న సొమ్ముతో బాకీ తీర్చుతాను" అన్నాడు.

"నువ్వు ఇంతవరకు సరిగా చెల్లిస్తున్నందువల్ల వదిలిపెడుతున్నాం. అయితే ఈ నెల సగమేకదా చెల్లించావు, మిగిలిన సగానికి రెట్టింపు వడ్డీ చెల్లించాల్సివుంటుంది" అన్నారు.

ప్రస్తుత సమస్య నుంచి తప్పించుకుంటే చాలు అన్న భావనతో 'అలాగే సార్' అని చెప్పి, గబగబా వెళ్ళిపోయాడు.

సన్నని మీసాలున్న మరో పొట్టి కార్మికుడు అప్పుల వాళ్ళనుంచి తప్పించుకోవడం కోసం మరుగుదొడ్డికి వెళ్లి (తన జీతాన్ని పంచెలో దాచుకొని),

బయటకు వచ్చాడు. అతడు ప్రతి నెలా తప్పించుకోవడానికి విఫలయత్నం చేసి, ఫలితంగా చావు దెబ్బలు తిని రెట్టింపు వడ్డీ చెల్లిస్తాడు. అయినా సరే, తప్పించుకోవాలనే ప్రయత్నం మానడు. చక్కెర వ్యాధిగ్రస్థుడికి ఎంత చెప్పినా వినకుండా 'ఈ రోజు మాత్రం తినేసి, ఓ బిళ్ళ ఎక్కువ వేసుకుంటే పోదా' అనుకొన్నట్లు అతడు తప్పించుకొనే ప్రయత్నం చేయడానికి అలవాటు పడిపోయాడు.

పొట్టివాడి స్వభావం తెలిసిన అప్పులవాడు బ్రహ్మ రాక్షసుడిలా నిలబడ్డాడు. పొట్టివాడు సమీపించగానే "ఈ నెల జీతం ఆవిరైపోయిందా?" అని ప్రశ్నించాడు.

పొట్టివాడి గొంతు తడారిపోయింది. కళ్ళు బైర్లుకమ్మాయి. భయమూ, వేదనా కలగలిసిన కళ్ళతో చూస్తూ 'నా మాట నమ్ము సేఠ్! మేము పని చేసుకుంటూ. సూపర్‌వైజర్, మైనింగు సర్దారుల గురించి, 'సిగ్గు లజ్జా లేని వెధవలు మన కడుపులు కొట్టి తమ కడుపులు నింపుకుంటున్నారు' అని మాట్లాడుకొంటుండగా, మైనింగు సర్దారు విన్నాడు. మా మాటలకు మరికొంత జోడించి సూపర్‌వైజర్ దగ్గర చాడీలు చెప్పాడు. నాజీతంలో పూర్తిగా కోత విధించారు" అన్నాడు. తిమ్మిని బమ్మిని చేయగలనన్న ధీమాతో.

సేఠ్ కళ్లు ఎర్రబడ్డాయి. ఆగ్రహంతో ఊగిపోతూ తీక్షణంగా చూశాడు. కుందేలుపై పంజా విసరనున్న పులిలా కనిపించాడు. విసుగూ, కసీ అతడి మొగంలో స్ఫుటంగా కనిపించాయి. "దొంగ వెధవా! ఆంజనేయుడి దగ్గరా నీ కుప్పిగంతులు?" అంటూ అతడి జుట్టు పట్టి ఈడ్చి వంగబెట్టి వీపు మీద బలంగా కొట్టాడు. బాధ భరించలేక వాడు మెలికలు తిరిగాడు. పంచె ఊడిపోయి, రూపాయి నోట్లు కింద పడ్డాయి.

పొట్టివాడి చెమటతో తడిసిన రూపాయినోట్లను సేఠ్ చేతుల్లోకి తీసుకొని "నీలాంటి వాళ్లను ఎంతమందిని చూశాను! నిన్ను గొడ్డును బాదినట్టు బాది, వీధిలో పడేస్తే నన్ను ప్రశ్నించే నాథుడెవడూ లేడు...... రూపాయలు వెదజల్లితే చాలు తోక వూపుకుంటూ అందరూ నావెంట తిరుగుతారు. డబ్బులతో ఎంతమందిని కొన్లేదు" అన్నాడు. బోనులో చిక్కిన ఎలుకలా భయంతో నిలువెల్లా వణుకుతూ నిలుచున్నాడు పొట్టివాడు.

"ఇదిగో పది రూపాయలు! ఈ నెల ఖర్చులకు వాడుకో! తిండి లేకపోతే ఎలా పనిచేయగలవు? పొదుపుగా బతకాలి. తిన్నగా పేకాటకు వెళ్ళకు" అంటూ అతనిపై శ్రద్ధగల వాడిలా సాగతీశాడు సేఠ్! పాములా ఒకేసారి ఎరను మింగేయకూడదు. ఆవులా గడ్డి మేసినట్టు మెల్లగా తినాలి. వాడ్ని మళ్ళీ మళ్ళీ అప్పు చేసేలా ప్రేరేపించాలి" అనుకున్నాడు మనసులో సేఠ్. పూర్తి జీతంతో ఇల్లు చేరిన వాళ్లను వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. ఎవరో ఒకరు, ఏదో విధంగా వాళ్ళ కష్టార్జితాన్ని కాజేస్తున్నారు. వాళ్ళ హక్కుల్ని కాలరాస్తున్నారు. శ్రమకు తగ్గ ఫలితం లేకుండా ఇల్లు చేరే మగవాళ్ళను చూసి విలపించే స్త్రీలు, వృద్ధులూ, యువకులూ, మధ్యవయస్కులు గుండెలు బండలు చేసుకొని, వేదాంత ధోరణి అలవరచుకొని బతుకులు వెళ్ళదీస్తున్నారు. ఓ పక్క పేదరికాన్ని ఆసరాగా చేసుకొన్న వడ్డీ వ్యాపారులు అప్పుమీద ఇస్తున్నందున వస్తువులన్నీ రెట్టింపు ధరలకు విక్రయిస్తోన్న వర్తకులు, మరోపక్క దుర్భర దారిద్ర్యం తీవ్ర నిర్బంధం వెరసి దెబ్బతిన్న బెబ్బులి మళ్ళా పైకి లేచినట్టు చావో రేవో హక్కుల కోసం పోరాడతాం అన్న తెగింపు వాళ్ళలో తలెత్తింది. ఒకరు ముగ్గురుగా, నాలుగురు పదుగురుగా విస్తరించి, అడవిలో నిప్పులా వ్యాపింపసాగింది. నాకు అన్న భావన 'మనకు'గా ఎదిగింది.

10

బికాస్ చౌదరి ఆరోగ్యం కుదుటపడింది. గని అతడ్ని రారమ్మని పిలుస్తోంది. శ్రమించడానికి అలవాటు పడ్డ చేతులు ఊరికే ఉండలేకపోతున్నాయి. పలుగూ పారా లేకుండా తాను బతకలేనని అతడు గ్రహించాడు.

ఎన్నో నెలలు గడిచినా గాయం తాలూకు బాధా, బలహీనతా పూర్తిగా తగ్గలేదు. బొగ్గు తవ్వడానికి గానీ, తొట్టెలో నింపడానికి గానీ చాలా ఇబ్బందిపడాల్సి ఉంటుందని ఆహార శరీరస్థితి తెలియజేస్తుంది. పనిలోకి వెళ్ళమని మనస్సు తొందర పెడుతున్నా, తొందర పడవద్దని శరీరం వారిస్తోంది. నేల మీద పడ్డ చేపలా తల్లడిల్లాడు.

బలమైన ఆహారమూ, పరిపూర్ణ విరామమూ లేని జీవితం, రక్తహీనత ఉందనీ బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలనీ వైద్యుడు సలహా ఇచ్చాడు. కానీ ముప్పూటలా గంజిగానీ, రొట్టెలకుగానీ నోచుకోలేని చాలీ చాలని సంపాదన. గనిలో పనిచేస్తున్న రోజుల్లో పరిస్థితి మెరుగ్గా ఉండేది. ఉద్యోగం పోవడంతో బాటు, గోరు చుట్టుపై రోకటి పోటులా వైద్యం ఖర్చులు. అక్కాబావలు కడుపు మాడ్చుకొని ప్రత్యేక శ్రద్ధతో వైద్యునికి చూపించారు. కోడి తన తిండికి తగ్గట్టేగా గుడ్డు పెడుతుంది! ఆదాయాన్ని బట్టే సౌకర్యాలు. డబ్బుతో ప్రమేయం లేకుండా శరీరాన్ని బలిష్టంగా తీర్చిదిద్దే ఉపాయం ఉందా? నాటు వైద్యుడు ఉందనే చెప్పాడు. పాతాళంలో పడిపోతున్న వాడికి పామునైనా తోడు చేసుకొని బతకాలని ఆశ కలగడం సహజం. అక్క నాటు వైద్యుడి మాటలకు తలొగ్గింది.

కొద్ది రోజుల పాటు గంజాయి ఆకు కషాయం తాగితే, అదనంగా ఆహారం తీసుకోకుండానే బలం చేకూరుతుందని చెప్పాడు. "ఎంత గొప్ప వైద్యం! పేదల పట్ల దైవానికి ఎంత జాలి! స్వార్థాన్ని త్యజించి, అడవుల్లో ఆకులు అలములు తింటూ, పరమార్థమే ధ్యేయంగా దైవ చింతనలో నిమగ్నమయ్యే ఋషులకు పరమాత్మ అష్టసిద్ధుల్ని, అన్ని శక్తుల్నీ సమకూర్చేవాడు. అలాంటి మహనీయుల్ని గుర్తించడమూ, విశ్వసించడమూ అందరి వల్లయ్యేపని కాదు" అనుకొన్నాడు.

ఖర్చు లేకుండా బలం చేకూరే మందు లభించడంతో ఆమె పొంగిపోయింది. త్వరలోనే తమ్ముడికి పూర్తిగా నయమౌతుంది. 'ఇకనైనా గని పనికి పంపించకూడదు. ఒకవేళ మొండికేస్తే కార్మిక సంఘం కార్యకలాపాల్లో పాల్గొననీ, పెండ్లి చేసుకొని ఇల్లు చూసుకుంటూ ఉండాలనీ ఒట్టేయించుకోవాలి" అనుకుంది.

తమకు సహాయం చేయడం కోసం దైవంచే పంపబడిన వైద్య స్వాముల వారికి విందు భోజనం పెట్టాలని ఆశ పడింది. తన శక్తికి మించిన భారమైనా, అప్పు చేసి ఆయనకు విందు భోజనం ఏర్పాటు చేసింది. ఆయన ఎప్పుడూ అలాంటి భోజనం చేసి ఎరుగడు. పాలకోవా, జాంగ్రీ, ఆవాల నూనెతో వేయించిన కట్లా చేప, నేతి చపాతీలు, పూరీ, నేతిలో వేయించిన వెదురు చిగురు, బాస్మతి అన్నం... ఇలా రకరకాల పదార్థాలు వడ్డించింది. ఆయన భోంచేసి, హుక్కా పీల్చుతూ స్వర్గ సుఖం చవిచూస్తున్నాడు. ఆమె మాత్రం మజ్జిగలో నానబెట్టిన అటుకులు తిని ఆకలి తీర్చుకుంది.

తన సపర్యల్లో లోటేమీ లేదని నిర్ధారించుకోవడానికి అన్నట్లు "స్వామీ, మేము పేదవాళ్ళం. మీకు తృప్తికరంగా భోజనం పెట్టలేక పోయినందుకు మన్నించాలి" అంది వినయంగా.

హర్షాతిరేకంతో పులకించిపోతున్నా, నిరాడంబరత్వాన్ని ప్రేమించేవాడిలా "పేదవాళ్ళు ప్రేమతో పెట్టే భోజనం రాజుస్థానంలో దొరికే భోగాలకంటే గొప్పది. దేవుడు బీదవాళ్ళు పెట్టే సాదాసీదా భోజనాన్ని వెదుక్కుంటూ వెళతాడు" అంటూ జ్ఞానబోధ చేశాడు.

ఆమె సంబరపడింది. 'సాధుపుంగవులు ఎప్పుడూ పేద, ధనిక భేదం పాటించకుండా మాట్లాడ్తారు. ఆయన అనుగ్రహం మాకు లభించింది. దేవుడు కష్టాల పాల్జేసినా, నీట ముంచేయడని పెద్దలు ఊరికే అన్నారా' అనుకుంది. 'స్వామీ, ఈ మూలిక ఎక్కడ దొరుకుతుందో చెబుతారా' అని సవినయంగా అడగింది. స్వామీజీ మనస్థితి ఏమిటో తెలుసుకోకుండా అడిగేశామేమో అన్న భయం ఆమె గొంతులో ధ్వనించింది. నాటకాల్లోనూ. చలన చిత్రాల్లోనూ తమ తపస్సుకు విఘాతం కలిగించే వాళ్ళను మునులు శపించడం ఆమెకు ఎరుకే. అందుకే భయం.

(ఇంకావుంది)

కవిత్వమ్

స్టార్



- చలపాక ప్రకాష్

రక్తదానం చేశాను
ఒక జీవితాన్ని కాపాడాననే ఆనందం
గోదానం-భూదానం చేశాను
ఒక కుటుంబానికి 'ఆసరా' కల్పించాననే
ఆత్మసంతృప్తి
డబ్బు ఉప్పొంగుకొచ్చింది
మబ్బుగా దాని పొరల కళ్ళను
కమ్మేస్తున్నట్లుంది
ఆరోజు ఒకరి నుండి మొదలై
ఈ రోజు-
కొన్నివందల మందికి 'అన్నదానం' చేశాను
ఈసారి ఆత్మసంతృప్తి కాదు
విజయగర్వంతో మీసం మెలితిరిగింది!
ఆశ్చర్యం!... ఆక్షణం ... అదే పంక్తిలో
ఒక చిరుగుల ముసలాయనకి
వంటకాలతోపాటు, కొన్ని వందల సలాములూ చేరుతున్నాయి.
టక్కున కళ్ళు చికిలించుకు చూశాను
చిత్రంగా ఆ ముసలాయనకి..
ఆ గెడ్డం మాసిన బక్కపల్చని ఆ ముసలాయనకి
అంత మర్యాదా?
ఆస్తీ లేదు పాస్తీ లేదు
నిలిచేందుకు నిలువు నీడా లేదు
గుర్తుకొస్తా వుంది
కంటికి పట్టిన ఒక్కొక్క పొరా విడనాడతావుంది
అతనికున్న ఆస్తి-
'పాఠశాల' అనే గోడల మధ్య
కన్న కొడుకులుగా తలిచే
జీవిత ప్రమాణాలకు విద్య నేర్పడం
ఆయన ఆస్తి-
కొన్నివేల జీవితాలను సక్రమ మార్గంలో పయనించే
'రహదారులు'గా తీర్చిదిద్దడం
ఆయన ఆస్తి
చదువుల నీడలో
మంచి వారసత్వపు కాయలను
ప్రపంచ నలుమూలలకూ పంచడం
అప్పుడు తెల్సింది-
ఆయన ఆస్తి తరగనిది, చెదరనిదని
ఆయన చేసే దానం క్షణికం కానిది
వెలకట్టలేనిదని!!
అప్పుడే తెరుచుకున్న అహంకారపు కళ్ళలోంచి
వాస్తవ దృశ్యాలు పుష్పాలుగా రాలాయి
ఆయనకు పాదాభిషేకం చేస్తూ అక్కున చేర్చుకున్నాయి
ఇంతకీ ఆయనెవరు?
ఆయనేనండీ మా 'మాస్టారు'
కష్టాల సుడిగుండంలో ఇరుక్కుపోయినా
స్వార్థంలేక
జగతికి 'వెలుగు'లు పంచిన మా'స్టారు'

నిరతం



- ఆశారాజు

కొన్నాళ్లే జీవించారు
వెళ్లిపోయి చాన్నాళ్లయింది
ఉన్నన్నాళ్లు దీపాల్లా బతికారు
ఎల్లకాలం గుభాళించే
సౌరభాల్ని వెదజల్లారు
కొన్నాళ్లే జీవించారు
పొద్దు పొడుపులా వెలిగారు

యుద్ధాలు జరుగుతుంటే
ఆయుధాలు అందించారు
గాయపడినపుడు
వొడిలో చేర్చుకున్నారు
అపాయం వచ్చినపుడు
ప్రాణాలిచ్చి కాపాడారు
కొన్నాళ్లే జీవించారు
వెయ్యేళ్ల దూరాన్ని నడిపించారు

ఉత్సవాలు చూశారు
ఉరికే నదుల్లా బతికారు
రంగులాడారు, అత్తర్లు చల్లారు
కన్నీళ్లు కనిపించకుండా
వెన్నెల్లా నవ్వారు
కొన్నాళ్లే జీవించారు
సముద్రాలన్నీ దాటించారు

వెళ్లిపోయి చానాళ్లయింది
ఇప్పటికీ మాతోనే వుంటున్నారు
ఈ గాలి చాలా పురాతనమైంది
వాళ్ల బతికిన కాలాన్ని మోసుకొస్తోంది
ఈ వాన అలనాడు కురిసింది
వాళ్ల నడిచిన అడుగుల్ని తడుపుతోంది
కొన్నాళ్లే జీవించారు
ఎన్నేళ్లకైనా మరణించబోరు

జంతువులు ప్రమాదాల్ని పసిగడ్తాయ్!

భూకంపాలు, అగ్ని పర్వత పేలుళ్ళు, ఇంకా అటువంటి కోవకు చెందిన ప్రమాదాలను జంతువులు ముందుగానే పసిగడ్తాయి. దీనికి ఉదాహరణగా ఒక సంఘటనను ప్రముఖంగా చెప్పుకోవచ్చు. వెస్టిండీస్ దేశం మార్టినిక్ ద్వీపంలోని సెయింట్ పీర్ పట్టణంలో 1902 సంవత్సరం మే నెలలో ప్రశాంతంగా ఉన్న ఒక రోజు జంతువులన్నీ రోడ్ల మీదకు పరుగులు పెట్టాయి. ఇళ్లలో నుండి కొట్టాల్లో నుండి ఎలుకలు, పిల్లులు, కుక్కలు, ఆవులు, పాములు ఒకటేమిటి అన్ని రకాల జంతువులూ బైటకు వచ్చి సముద్రపు ఒడ్డు వైపుగా పరుగులు తీశాయి. ఒడ్డుకు చేరుకునేవరకు ఒక్కటి కూడా మధ్యలో ఆగలేదు. అన్నీ నీటిలో దిగి ఈదడం మొదలు పెట్టాయి. కొన్ని నీటిలో మునిగిపోయాయి. జంతువులు అలా ఎందుకు పరుగులు పెట్టాయో పీర్ పట్టణ ప్రజలకు అర్థం కాలేదు. మార్టినిక్ ద్వీపం అగ్ని పర్వతాలతో నిండి ఉంటుంది. పీర్ పట్టణంలోకెల్లా పెద్దదైన పీలీ పర్వత పాదాలవద్ద ఉంది. పీర్ పట్టణ ప్రజలు అనుకోని ఉపద్రవమేదైనా సంభవిస్తుందేమోనని భయపడ్డారు. అయితే మార్టినిక్ ద్వీప శాస్త్రజ్ఞులు అటువంటిదేమీ లేదని, ప్రజలు ఉన్మాదులుగా తయారుకావద్దని సూచనలు చేశారు. పరిశోధనాశాలల్లోని భూకంపలేఖినిలు భూకంపాలగూర్చి ఎటువంటి చిన్న సూచనలను సైతం చేయడం లేదని వారు నిర్ధారించారు. ఆ తర్వాత మూడు రోజులకు పీలీ పర్వతం బద్దలైంది. ఆ బ్రహ్మాండ విస్ఫోటనం పట్టణంలోని 30 వేల మంది ప్రజలను కబళించివేసింది. అగ్నిపర్వతం నుండి వెలువడిన లావా పట్టణం మొత్తాన్ని చుట్టేసింది. పట్టణం మొత్తమ్మీద ఇద్దరు మాత్రమే అగ్ని పర్వతం సృష్టించిన ప్రళయం నుండి ప్రాణాలతో బయటపడ్డారు. వారు ఒక చెప్పులు కుట్టే వ్యక్తి. మరొకరు ఖైదీ. పట్టణంలోని జైలు బిల్డింగ్ ఈ విలయంలో చెక్కుచెదరకుండా నిలచివుంది. ఈ కారణంగా అందులో ఖైదీ రక్షించబడ్డాడు. ఇకపోతే ఈ ప్రమాదంలో ఒకే ఒక పిల్లి మృతి చెందింది. బహుశా ఇది ఒక ఇంటిలో బంధించబడి వుండడం వల్ల మిగతా వాటితో పాటు వెళ్లలేకపోయి వుంటుంది.

కంగారు పేరెలా వచ్చింది?

ఆస్ట్రేలియా జాతీయ మృగం కంగారు అని మనకు తెలుసు. దానికి మనం మన తెలుగు అర్థం చూసుకుని నవ్వుకొంటుంటాం. అయితే దానికి ఆ పేరు రావడానికో కారణం ఉంది. 1770లో ప్రఖ్యాత నావికుడు కేప్టన్ కుక్ ఆస్ట్రేలియా తీరంలో కాలు పెట్టగానే కనిపించిన జంతువులను చూసి చాలా ఆశ్చర్యపడ్డాడు. కడుపుపై సంచిలాంటి భాగంలో తమ పిల్లల్ని దాచుకుని విచిత్రంగా ఉన్నాయి. దగ్గరలో ఉన్న ఆస్ట్రేలియన్ ఆదివాసిని వాటి పేరేమిటని అడగగా అతను 'కాన్ గురు' అని సెలవిచ్చాడట. దాంతో కుక్‌గారు దాన్ని 'కంగారు'గా ప్రచారంలోకి తెచ్చాడు. కాని ఆ ఆస్ట్రేలియా ఆదివాసి దృష్టిలో కాన్‌గురు అంటే 'నాకేమీ బోధపడడం లేదు' అని అర్థమట. కంగారు పేరు చాలా కంగారులో వచ్చింది కదూ!

తెలుసా!

పాములన్నీ గుడ్లు పెట్టవ్!

పాములు గుడ్లు పెడతాయని మనకు తెలుసు. అయితే అన్ని రకాల పాములూ గుడ్లు పెట్టవు. పాములలో చాలా రకాలున్నట్టు వాటి పునరుత్పత్తి విధానాల్లోనూ రకాలున్నాయి. పాముల్లో రాటిల్ స్నేక్, కాపర్ హెడ్స్, నీటి పాములు, గారర్ స్నేక్స్ వంటి చాలా రకాలు గుడ్లు పెట్టవు. ఇవి పిల్ల పాముల్ని కంటాయి. వీటిలో కొన్ని రకాల పాములు ఒకసారి 75 పిల్లల్ని కంటాయి. పాముల్లో చాలా రకాలు గుడ్లు పెడతాయి. అవి రాళ్ల కింద, దుంగల కింద, చెట్ల తొర్రల్లో గుడ్లు పెడతాయి. అయితే ఇవి కోడిగుడ్లలాగా అన్నీ ఒకే సైజులో వుండవు. కొన్ని పెద్దవి, మరికొన్ని చిన్నవిగా వుంటాయి. పాముల్లో బుల్ స్నేక్ రకం పాము, ఇంకా అటువంటి పెద్ద సైజు పాముల గుడ్లు కోడిగుడ్డు సైజులో ఉంటాయి. పాముల గుడ్ల పెంకు కొద్దిగా సాగే గుణం కల్గి ఉన్నా గట్టిగా ఉంటాయి. పైథాన్ రకం పాము ఎక్కువ గుడ్లు పెట్టగలిగేదిగా గుర్తించారు. ఇండియన్ పైథాన్ ఒకేసారి 107 గుడ్లు పెడుతుంది. పాముగుడ్లు సూర్యకాంతిచే పొదగబడతాయి. కొన్ని సందర్భాల్లో పాములు గుడ్లను చుట్టుకొని ఉండడాన్ని కూడా గుర్తించారు. వందేసి గుడ్లను పెట్టేపాములు అవి పిల్లలైన తరువాత వాటి సంరక్షణా భారాన్ని ఏ మాత్రమూ వహించవు. పుట్టిన దగ్గర నుండి పిల్లలు తమ విషయాలన్నీ తామే చూసుకోవాలి.



చేద్దామా

పూల తటాకం

చిన్నారి నేస్తాలూ! మీరు ఇంటి హాల్లోనో లేదా డైనింగ్ రూంలోనో పెట్టుకోవడానికి ఒక పూల తటాకం ఏర్పాటు చేసుకుంటే ఎలా వుంటుంది. అదీ మీ ఇంట్లో ఉండే వస్తువులతోనే. ఎక్కడో కోనేటిలో తేలే పూలు మన ఇంట్లో ఉంటే... చాలా ఆనందంగా వుంటుంది కదూ.

<u>కావలసినవి...</u>

ఒక చిన్న ప్లాస్టిక్ టబ్, నీళ్లు, రకరకాల తాజాపూలు. అంతే!

<u>ఇక తయారు చేద్దామా...</u>

ఇంట్లో ఉన్న ప్లాస్టిక్ టబ్ తీసుకుని దానిలో సగానికి కొంచెం పైకి నీళ్లు పోయాలి. ఇప్పుడు నీళ్లపైన మీరు తీసుకొచ్చిన పూలను కొద్దిగా కాడను వుంచి ఆనీటిపై తేలేట్టుగా వుంచాలి. వాటి మధ్యలో మనం దీపావళికి తెచ్చుకుంటామే చిన్ని చిన్ని గిన్నె క్యాండిల్స్, వాటిని ఈ పూల మధ్యలో అమర్చి వెలిగిస్తే చాలా అందంగా వుంటుంది. ఇవే ఎందుకంటే తేలికగా వుంటాయి కాబట్టి. నీటిలో మునగవు. ఇలా చేసిన పూల తటాకంలో పూలు మూడు రోజులు కూడా వాడి పోకుండా వుంటాయి. మీ ఇంటికి ఎవరైనా బంధువులు వచ్చినప్పుడు కానీ, లేదా మీ పుట్టిన రోజునాడు గానీ ఇలాంటి ఏర్పాటు చేసి చూపిస్తే ఎలా వుంటుంది. ఒక్కసారి ఆలోచించండి...

చుక్కలు కలిపి చూడు



కనిపెట్టేస్తే పోలా...

నేస్తాలూ! ఇదేదో టెడ్డీబేర్ షాపులా ఉందికదూ. అయితే ఈ బొమ్మలో కొన్ని వస్తువులు దాగున్నాయి. అవి ఏంటంటే... పెన్సిల్, టూత్‌బ్రష్, ఐస్ క్రీం, అమ్మాయి ముఖం,గరాటు, సాక్స్, తెరచాప పడవ, కుందేలు, చేతి గ్లౌజు, పూలకుండీ, పెయింట్ బ్రష్, నక్షత్రం, కిరీటం, పాము, భూతద్దం.

పదాలెక్కడ?

పిడుగులూ... చూశారుగా. ఇక్కడ చాలా ఇంగ్లీషు అక్షరాలు ఉన్నాయి. వాటి కిందే కొన్ని పదాలు కూడా వున్నాయి. మీరేం చేయాలంటే ఆ పదాలను ఈ అక్షర సమూహంలో ఎక్కడున్నాయో వెతికి సున్నా చుట్టాలి.

D	R	T	S	H	A	E	L	S	E
R	H	A	G	N	A	B	H	C	I
A	A	Y	F	C	O	E	M	A	O
Y	K	N	T	I	N	I	Z	I	I
E	U	N	U	Z	K	N	L	E	S
V	N	S	I	I	A	I	N	T	O
A	A	T	I	B	T	I	M	O	N
R	M	H	E	B	N	E	W	M	I
G	A	S	A	R	A	F	I	N	A
T	T	L	L	E	N	R	I	U	W
N	A	M	R	B	J	Q	A	A	A
A	T	N	K	Q	S	U	T	S	S
H	A	S	E	R	W	E	O	R	A
P	R	I	D	E	R	O	C	K	F
E	H	B	F	H	U	A	T	A	U
L	N	Y	O	D	L	Q	A	D	M
E	O	L	E	A	E	B	G	R	U
X	E	D	N	N	M	X	A	O	Z
G	N	I	K	U	A	C	K	J	A
J	C	I	P	K	S	S	Y	L	Z



BANZAI
ELEPHANTGRAVEYARD
HAKUNAMATATA
HYENAS
KING
LIONS
MUFASA
NALA
PRIDEROCK
PUMBAA
QUEEN
RAFIKI
SARABI
SARAFINA
SCAR
SHENZI
SIMBA
TIMON
WATERHOLE
ZAZU

బాలనేస్తాలు



పదాలు రాసేద్దాం

హాయ్ ఫ్రెండ్స్... పైన కొన్ని ఇంగ్లీషు అక్షరాలు ఉన్నాయి చూశారుగా. వాటితో మీకు వీలైనన్ని పదాలు రాయండే. అన్నట్టు ప్రతి పదంలోనూ 'D' వుండాలి. అన్నీ మూడక్షరాల పదాలే సుమా!



దారి చూపుదామా!

నేస్తాలూ... ఈ పప్పీకి సరదగా ఒక ఆట ఆడాలనిపించిందట. కానీ ఒంటరిగా లోపలికి వెళ్తే బయటకు రాగలనా అని ఆలోచిస్తోంది. మరి మనం సాయం చేద్దామా.

ఒకేలా ఉన్నవేంటో...

హాయ్ పిడుగులూ! ఇక్కడ బోలెడు టెడ్డీబేర్‌లు ఉన్నాయి చూశారుగా. వీటిలో ఒకేలా ఉన్నవాటిని జత చేయాలి. తర్వాత మా జవాబుతో సరి చూసుకోండే.



జతచేద్దాం

చిన్నారులూ... ఇక్కడ ఎనిమిది మంది తలలున్నాయి. కానీ ఒకరితల సగం మరొకరి సగం తలకి అతికించి వుంది. మీరు చకచకా ఎవరి తల సగభాగం వారికి జతచేసి అతికించేయాలి.

జవాబులు

జతచేద్దాం:
ఎ-డి, బి-ఇ, సి-జె, ఎఫ్-ఓ, డి-ఎల్, హెచ్-ఎమ్, ఐ-ఎన్, కె-పి

పదాలు రాసేద్దాం:
AND,DOG,GOD,DEN,
SAD,RED,NOD,END.

ఒకేలా ఉన్నవేంటో...:
1-12, 2-13,
3-5,4-6,7-16,8-10,
9-15,11-14.

కనిపెట్టేస్తే పోలా...



అష్టమీది కథ

అమెరికా స్వాతంత్ర్యం ఒక మేడిపండు

జూలై 4న అమెరికా 234వ స్వాతంత్ర్యదినోత్సవం జరుపుకోబోతోంది. అమెరికా స్వాతంత్ర్యానికి, ఇతర విముక్తి దేశాలకు ఒక తేడా ఉంది. అమెరికాలోని స్థానికులైన రెడ్ ఇండియన్ల స్వాతంత్ర్యాన్ని హరించి, ఆ జాతులను నాశనం చేసి, కొన్ని ప్రాంతాలకే పరిమితం చేశారు ఐరోపానుంచి వచ్చిన వలసవాసులు. రెడ్ ఇండియన్లను ఊచకోత కోయటంతో పాటు ఆఫ్రికా ఖండం నుంచి అక్కడి జనాన్ని బానిసలుగా తీసుకువచ్చారు. తమ స్థానాన్ని సుస్థిరం చేసుకున్న తరువాత తమపై బ్రిటీష్ పెత్తనం ఏమిటని తిరుగుబాటు చేసి స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు.వారే తరువాతి కాలంలో సామ్రాజ్యవాదులుగా మారి ప్రపంచ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించేందుకు పూనుకున్నారు, ఇప్పటికీ అదే పని చేస్తున్నారు.

ఇప్పటివరకు అక్కడ జరిగిన స్వాతంత్ర్య ఉత్సవాలు ఒక ఎత్తైతే ఈ ఏడాది మరో అంకానికి తెరతీయనుంది.తొలిసారిగా అధ్యక్షుడిగా ఎన్నికైన ఆఫ్రో-అమెరికన్ తరగతికి చెందిన బరాక్ హుసేన్ ఒబామా స్వాతంత్ర్య సందేశం ఇవ్వనున్నారు. తెల్లవారి నాయకత్వంలోనే అయినప్పటికీ స్వాతంత్ర్యం వస్తే తమ బానిసబతుకులు మారిపోతాయని భావించిన ఆఫ్రో-అమెరికన్లు స్వాతంత్ర్య ఉద్యమంలో తమవంతు పాత్ర నిర్వహించారు. అయితే 234 ఏళ్ల స్వాతంత్ర్యంలో వారికి అడుగడుగునా అవమానాలు, అన్యాయాలు జరిగాయి, జరుగుతున్నాయి. తమ సంతతికి చెందిన ఒబామాను ఏ విధంగా అయినా గెలిపించుకోవాలని భావించిన ఆఫ్రో-అమెరికన్లు అసాధారణ రీతిలో ఓటింగ్‌లో పాల్గొని ఒబామాను శ్వేతసౌధంలో చూసి పులకించిపోయారు. అయితే పళ్లూడ గొట్టించుకోవటానికి ఇనుప సుత్తి అయినా బంగారపుదైనా ఒకటే అని వారు త్వరలో గ్రహించే విధంగా వందరోజులు దాటిన ఒబామా పోకడలు కనిపిస్తున్నాయి. ఈ సందర్భంగా అమెరికా చరిత్రలో వారి పాత్రను రేఖా మాత్రంగా అవలోకిద్దాం. రండి మరి.

- ఎం. కోటేశ్వరరావు

ఇటీవల ఒక జిల్లా జడ్జి కోడలిని వేధించిన కేసులో అరెస్టు అయ్యాడు. పాపం ఆ పెద్దమనిషి "ప్రతి మామా ఒకింటి అల్లుడే" అని గ్రహించలేకపోయాడు. తన తల్లిదండ్రులు తన భార్యను వేధిస్తే తన పరిస్థితి ఏమిటో గ్రహించలేకపోయాడు. అదే విధంగా అమెరికన్లు తామూ ఒకనాడు స్వాతంత్ర్యం కోసం పోరాడిన విషయాన్ని మరిచిపోయి ప్రపంచంలో స్వాతంత్ర్యం కోరుకొనే వారిని అణచేందుకు నానా గడ్డీ కరుస్తున్నారు.

దోపిడీవర్గాలు బలహీనంగా ఉన్నపుడు శ్రామికవర్గ తిరుగుబాట్లు, సామ్రాజ్యవాదులు బలహీనంగా ఉన్నసమయంలో వలసదేశాల స్వాతంత్ర్య ప్రకటనలు ఏ చరిత్ర చూసినా మనకు కనిపిస్తాయి. అమెరికా కథ కూడా అదే. పారిశ్రామిక విప్లవం తరువాత ఐరోపాలోని బ్రిటీష్, ఫ్రెంచి సామ్రాజ్యవాదులు తమ వాణిజ్య విస్తరణకు ప్రపంచాన్ని వలసగా చేసుకోవటంలో పోటీ పడ్డారు. అందుకు భీకరమైన యుద్ధాలకు పాల్పడ్డారు. నేటి అమెరికా సంయుక్త రాష్ట్రాలుగా ఉన్న ప్రాంతంపై ఎవరికి వారే ఆధిపత్యాన్ని ప్రకటించుకున్నారు. మానవరక్తం రుచి మరిగిన మృగం ఒక అడవి నుంచి మరో అడవిలోకి వెళ్లినా అక్కడా రక్తం కోసమే ఎదురు చూస్తుంది. ఐరోపా నుంచి అలాంటి రుచి మరిగిన వారు అమెరికా వచ్చి అక్కడ స్థిరపడ్డారు. ధనవంతులైన తరువాత తాము కూడా ప్రపంచంలో వలసలు ఏర్పాటు చేసుకొని మరింత బలపడవచ్చని అవకాశం కోసం ఎదురు చూస్తున్న తరుణంలో ఫ్రెంచి-బ్రిటీష్ వారి ఆధిపత్య పోరు వారికి అయాచిత వరంగా లభించింది.

స్పెయిన్ రాజు తరపున భారత్‌కు దారిని కనుగొనేందుకు బయలుదేరిన కొలంబస్ 1492లో అమెరికా ఖండపు గడ్డపై కాలు పెట్టాడన్న అంశం అందరికీ తెలిసిందే. అందుకు అక్కడ తాను చూసిన అమెరికా స్థానికులకు రెడ్ ఇండియన్లని పేరు పెట్టాడు.అయితే మనం ఇప్పుడు అమెరికాగా పరిగణిస్తున్న ప్రాంతంలో కాలుమోపిన తొలి ఐరోపావాసిగా స్పెయిన్‌కు చెందిన జువాన్ పాండ్ లియో చరిత్ర కెక్కారు. అతను 1513 ఏప్రిల్ రెండున ఫ్లోరిడాలో కాలు



పెట్టాడు. అప్పటి నుంచి స్పెయిన్‌వారు, తరువాత కాలంలో ఫ్రాన్స్, డచ్, బ్రిటన్, ఇతర ఐరోపా దేశాలనుంచి వలసలు పెరిగాయి. అయితే బ్రిటీష్ వారు ఆలస్యంగా వచ్చినప్పటికీ అప్పటికే ప్రపంచంలో అగ్రరాజ్యంగా ఉండటంతో అమెరికాలోని అత్యధిక ప్రాంతాలు తనవే అని ప్రకటించుకుంది. అంతేకాదు 1610–1776 మధ్య బ్రిటన్‌లోని 50వేల మంది నేరగాళ్లను అమెరికాకు తరలించి అక్కడి జైళ్లలో పెట్టింది. తరువాత కాలంలో అమెరికన్లు కూడా ఇదే తప్పుడు పనులు చేయటానికి అదే నాంది.

ఐరోపాలోని ఆస్ట్రియాపై ఆధిపత్యం కోసం జరిగిన పోటీలో(1740–48) బ్రిటీష్‌వారిదే పైచేయి అయింది. అమెరికాలో తమవిగా చెప్పుకున్న అత్యధిక ప్రాంతాలను బ్రిటీష్ వారికి అప్పగించేందుకు ఫ్రాన్స్ అంగీకరించింది. ఫ్రెంచి ప్రమాదం తప్పిపోవటంతో అమెరికాలోని వలస ప్రాంతాలపై తమదే అధిపత్యం అని ప్రదర్శించుకొనేందుకు బ్రిటన్ ప్రభుత్వం అనేక పన్నులు విధించి జనంలో అప్రదిష్టపాలైంది. మనం కూడా ఆంగ్లేయులమే అయినప్పటికీ బ్రిటన్ ఆంగ్లేయులు మనపై పెత్తనం సాగించటం ఏమిటి? మన హక్కులను పరిమితం చేయటం ఏమిటంటూ అమెరికాలోని వారు తిరుగుబాటును ప్రకటించారు. బ్రిటన్ చేతిలో పరాజయంపాలైన ఫ్రాన్స్ దీన్ని అవకాశంగా తీసుకొని తిరుగుబాట్లకు మద్దతు ఇచ్చింది. వ్యూహాత్మంగా బానిసలుగా ఉన్న నల్లజాతివారిని, రెడ్ ఇండియన్లను కూడా తమతో కలుపుకొని 1763 నుంచి సాగించిన పోరుతో చివరకు 1776 జులై నాలుగున పదమూడు రాష్ట్రాలు స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాయి. దానిని బ్రిటీష్ రాజు మూడవ జార్జి తిరస్కరించి తిరుగుబాటును అణచేందుకు సైన్యాన్ని పంపాడు. వారిని ఎదుర్కొనేందుకు అమెరికన్లు ఫ్రాన్స్‌తో పాటు స్పెయిన్, డచ్‌వారితో కూడా ఒప్పందాలు చేసుకొని వారి సహాయం పొందారు (అలాంటి వారు తరువాత కాలంలో తమ విముక్తి కోసం భారత్ సహాయం తీసుకున్న బంగ్లాదేశ్, భారత్‌లకు వ్యతిరేకంగా పాకిస్తాన్ తరఫున అమెరికా వారు బంగాళాఖాతంలోకి సప్తమ నౌకాదళాన్ని పంపి దాడులకు సిద్ధపడ్డారు. దాంతో భారత్ నాటి సోవియట్ యూనియన్‌తో రక్షణ సంధి చేసుకోవటంతో అమెరికన్లు తోకముడిచారు). చివరకు అంతర్యుద్ధంలో ఓడిపోయిన బ్రిటన్ 1783లో పారిస్ ఒప్పందంపై సంతకం చేసి అమెరికాలోని పదమూడు రాష్ట్రాలపై తమకెలాంటి అధికారం లేదని అంగీకరించింది. విడివిడిగా ఉంటే ఎప్పుడైనా తమకు బ్రిటన్ ముప్పు తలపెట్టవచ్చని భయపడిన పదమూడు రాష్ట్రాలు అమెరికా సంయుక్త రాష్ట్రాలుగా ఏర్పడేందుకు నిర్ణయించాయి. ఆ తరువాత వారు తమకు సాయం చేసిన స్పెయిన్‌వారితో అందరినీ ఓడించి అనేక ప్రాంతాలను తమలో విలీనం చేసుకున్నారు. అలా పెరిగి మరో 37 రాష్ట్రాలను కలుపుకున్నారు. అందుకే ప్రతి రాష్ట్రానికి ప్రత్యేక నిబంధనలు, చట్టాలు ఉన్నాయి. అయితే ప్రపంచాన్ని దోపిడీ చేయటంలో, ఇతర రాజ్యాలపై దాడులు చేయటంలో మాత్రం అన్నింటిదీ ఒకటే మాట.ఒకటే బాట.

అలాంటి అమెరికా చరిత్రలో ఒక పెద్ద మాయని మచ్చ బానిస వ్యాపారం, జాతి వివక్ష. అమెరికాకు వలస వచ్చిన తెల్లవారు తమ ప్రాంతాలలో తమకు



అంతరాల దొంతరలు

అమెరికా అభివృద్ధిలో ఆఫ్రో-అమెరికన్ల శ్రమ, స్వేదం ప్రతి చోటా కనిపిస్తాయి. నిజానికి వారు లేకుండా ఆధునిక అమెరికాకు పునాది లేదని చెప్పవచ్చు. ఆఫ్రో-అమెరికన్లు చారిత్రకంగా మితవాద రిపబ్లికన్ మద్దతుదార్లుగా ఎక్కువ కాలం ఉన్నారంటే అతిశయోక్తిగా ఉండవచ్చు. రిపబ్లికన్ అధ్యక్షుడు అబ్రహం లింకన్ బానిసత్వాన్ని రద్దు చేసినప్పటినుంచి వారు ఆపార్టీ మద్దతుదార్లుగా మారారు. అయితే 1930వ దశకంలో సంభవించిన మహా సంక్షోభ సమయంలో డెమోక్రటిక్ పార్టీ నాయకుడు రూజ్వెల్ట్ ప్రకటించిన ఉద్దీపన పథకం ఆఫ్రో-అమెరికన్లకు ఆర్థికంగా ఎంతో ఊరటనిచ్చింది. తరువాత కెన్నడీ, లిండన్ జాన్సన్ ప్రభుత్వాలు తీసుకున్న చర్యలతో ఆఫ్రో-అమెరికన్లు డెమాక్రటిక్ పార్టీ మద్దతుదార్లుగా మారారు. ఒబామా ఎన్నిక సందర్భంగా అది మరింతగా పెరిగింది. దాని ప్రభావం ఎలాంటిదంటే ఎన్నికల తరువాత జరిగిన రిపబ్లికన్ పార్టీ తన అధ్యక్షుడిగా ఒక నల్లజాతీయుడిని ఎన్నుకోవాల్సి వచ్చింది. నల్లజాతీయుల సాధికారత ఉద్యమం సంస్కరణవాదానికి గురైంది. విద్య, వైద్యం, తదితర అన్ని రంగాలలో జరుగుతున్న అన్యాయాలు, విస్మరణనుంచి బయట పడాలంటే తమవారికి ప్రత్యేక కాలేజీలు, క్లబ్బులు, ప్రత్యేక రేడియో, టీవీ స్టేషన్ల వంటి వాటిని ఏర్పాటు చేయించింది. అది పరిమిత ఫలితాలనే సాధించింది. అమెరికన్లలో తెల్లవారి సగటు ఆదాయం 2007లో 54,290 డాలర్లు ఉంటే ఆఫ్రో-అమెరికన్లకు 33,916 మాత్రమే ఉంది. తెల్లవారి వేతనాల్లో 65శాతం మాత్రమే వీరికి ఇస్తున్నారు. ఫోర్బ్స్ 2007 జాబితాలో 2000 మంది అమెరికన్ ధనికులలో ఆఫ్రో-అమెరికన్లలో ఓప్రా విన్‌ఫ్రే 250కోట్ల డాలర్లతో ప్రథమ స్థానంలో ఉన్నారు. అయితే అదే తెల్లవారిలో బిల్‌గేట్స్ ఆస్తివిలువ 5,900 కోట్ల డాలర్లు. అక్కడి సమాజంలో ఉన్న అంతరాలకు ఇది చక్కటి నిదర్శనం. దేశంలోని అత్యంత ధనికులైన 400మందిలో విన్‌ఫ్రే ఒక్కరే ఉన్నారు. విద్యారంగంలో తెల్లవారు వందమంది కాలేజీలకు వెళితే నల్లజాతీయులు సగం మందే వెళుతున్నారు. కేవలం 47శాతం మందికి మాత్రమే స్వంత ఇళ్లు ఉన్నాయి. దారిద్ర్యం ఎక్కువగా ఉంది. వేతనాలలో వ్యత్యాసం, మహిళలకు మరింత తక్కువ.

నల్లజాతి రత్నాలు

ఆఫ్రో-అమెరికన్లను ఎంతగా అణచివేసినా, వారికి సమాన అవకాశాలను ఎంతగా నిరాకరించినా వారిలో ఎందరో ఎన్నో విజయాలు సాధించారు. అమెరికా అణుబాంబును రూపొందించిన బృందంలో ఆరుగురు శాస్త్రవేత్తలున్నారు. బూట్లను తయారు చేసే యంత్రాన్ని రూపొందించింది, స్టీమ్ ఇంజన్లకు ఆటోమాటిక్ లూబ్రికేషన్ పరికరాన్ని, నడుస్తున్న రైళ్లకు సమాచారాన్ని చేరవేసే తొలి వ్యవస్థను, తొలి ఆటోమాటిక్ ట్రాఫిక్ సిగ్నల్, గ్యాస్ మాస్కులను కనుగొన్నది నల్లవారే. రవాణాలో కూరగాయలు, పాలు, పండ్లవంటివి చెడిపోకుండా ఉంచేందుకు వాహనాలకు రిఫ్రిజిరేటర్లు, బ్లడ్ బ్యాంకుల ఏర్పాటు, ఎయిర్ కండిషనర్లు, నౌకల ప్రొపెల్లర్ కనుగొన్నది వారే. ఇంతెందుకు విద్యుత్ బల్బును కనుగొన్నది థామస్ ఆల్వా ఎడిసన్ అని చరిత్రలో నమోదైంది. అయితే ఆయన ముందుగా కనుగొన్న బల్బు కొన్ని నిమిషాలు మాత్రమే వెలిగింది. నల్లజాతీయుడైన గ్రాన్‌విలే ఉడ్స్ తాను కనుగొన్నవాటిని, పేటెంట్ ఉన్నవాటిని కూడా అలెగ్జాండర్ గ్రాహమ్‌బెల్, థామస్ ఆల్వాఎడిసన్ తస్కరించారని కోర్టుకు వెళ్లి విజయం సాధించారు. ఎలక్ట్రిక్ రైల్వే వ్యవస్థకు అవసరమైన పరికరాలలో ముప్పై ఐదింటికి పేటెంట్స్ సాధించిన గొప్ప వ్యక్తి ఉడ్స్. పర్సనల్ కంప్యూటర్లకు మూలమైన తొలి తొమ్మిది పేటంట్లలో మూడు నల్లజాతీయులవే. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయి. బానిసలుగా ఉన్న వారు కనుగొన్న అనేక కొత్త అంశాలను స్వంతం చేసుకున్న బానిస యజమానులెందరో. ఆఫ్రో-అమెరికన్లు 1913 నాటికే ఇలాంటి వెయ్యి పేటెంట్లు పొందారు. ప్రపంచాన్ని ఊపివేసిన రాక్ అండ్ రోల్ డాన్సు, బ్లూస్, జాజ్, క్రైస్తవ గీతాల ప్రాచుర్యం ఆఫ్రో-అమెరికన్ల చలువే.


అబ్రహం లింకన్


మార్టిన్ లూథర్ కింగ్


ఆలివర్ క్రామ్‌వెల్

బకాయిపడినవారు, తమ వద్ద అప్పుతీసుకొని తీర్చలేని నిస్సహాయులైన తెల్లవారిని పని నేర్పించే పేరుతో స్కాట్లండ్, ఐర్లండ్, బ్రిటన్, జర్మనీ తదితర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి వ్యవసాయ క్షేత్రాలలో పెట్టారు. బ్రిటీష్ ఇండియా కంపెనీ తరఫున మన దేశం నుంచి కూడా అనేక మందిని అలా తరలించారు. ప్రారంభంలో అలాంటి వారి సంఖ్య మొత్తం వలస వచ్చిన తెల్లవారిలో సగం ఉంది. అయితే అలా వచ్చిన వారు అమెరికాలోని వాతావరణ పరిస్థితుల్లో సరిగా పనిచేయలేకపోయారు. అక్కడి దోపిడీ, దాడులతో అనేక మంది పారిపోయేందుకు ప్రయత్నించారు. రెడ్ ఇండియన్లను కూడా బానిసలుగా చేసుకున్నారు. వారిని ఒక రాష్ట్రం నుంచి ఒక రాష్ట్రానికి బదలాయించి క్రయ విక్రయాలు జరిపారు. ఇది కూడా లాభసాటిగా ఉండటంతో అలాంటి వారి దృష్టి ఆఫ్రికా ఖండంపై పడింది. స్పెయిన్ వారే 1526లో ఆఫ్రికన్ బానిసలను అమెరికాకు ముందుగా తీసుకువచ్చారు. అయితే వారి సంఖ్య గురించి సరైన సమాచారం లేదు. చరిత్రలో నమోదైన వివరాల ప్రకారం 1619లో వర్జీనియా రాష్ట్రంలోని జార్జిటౌన్‌లో ఆఫ్రికన్ బానిసలు గణనీయంగా ఉన్నారు. అలా వచ్చిన వారిలో కొందరు బానిసత్వం నుంచి బయటపడి వారు కూడా భూమీపుత్రా సంపాదించి ధనవంతులయ్యారు. అమెరికాకు స్వాతంత్ర్యం వచ్చే నాటికి జనాభాలో 20శాతం మంది ఆఫ్రో-అమెరికన్లు ఉన్నారు. అమెరికా స్వాతంత్ర్య ఉద్యమంలో మనకు కొద్దిగా పరిచయమైన పేరు ఆలివర్ క్రామ్‌వెల్. ఆయన నల్లజాతీయుడు. బ్రిటీష్‌వారిని ఓడించటంలో కీలక పాత్ర వహించిన యార్క్‌టౌన్ విజయానికి క్రామ్‌వెల్ ఒక ముఖ్యపాత్రధారి. స్వాతంత్ర్య ఉద్యమ అగ్రనాయకుడు జార్జి వాషింగ్టన్ డెల్‌వేర్ జలసంధిని దాటేందుకు ఉపయోగించిన పడవలో క్రామ్‌వెల్ కూడా ఉన్నారు. అలాంటి నల్లజాతీయులను బానిసత్వం నుంచి విముక్తి చేయటానికి అమెరికన్ పాలకులకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత వందేళ్లు పట్టింది. అదీ మరోమారు అంతర్యుద్ధం చెలరేగటంతో ఒక పక్షం తమ అవసరాల కోసం 1863లో నాటి అధ్యక్షుడు అబ్రహం లింకన్ నల్లజాతీయుల మద్దతు పొందటం కోసం బానిసత్వ నిర్మూలన ప్రకటన చేశారు. అయినప్పటికీ అనేక రాష్ట్రాలు దానిని ధిక్కరించి దొడ్డిదారిన చేసిన చట్టాలతో బానిసత్వాన్ని కొనసాగించాయి. 1896లో సుప్రీంకోర్టు తీర్పు తరువాత వారికి కొన్ని హక్కులు వచ్చాయి. తమపట్ల చూపుతున్న వివక్షకు అంతం పలకాలని ఆఫ్రో-అమెరికన్లు తరువాత కూడా అనేక ఆందోళనలు చేశారు. అయినా కొనసాగుతూనే వచ్చింది.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అనేక దేశాలలో వచ్చిన మార్పులు,దక్షిణాఫ్రికా, జింబాబ్వే, తదితర దేశాలలో జాత్యహంకారం, వలసపాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలు, స్వాతంత్ర్యం, ఆత్మగౌరవ నినాదాలు ఆఫ్రో-అమెరికన్లను కూడా ప్రభావితం చేశాయి. జాతి వివక్షకు అంతం పలకాలని కోరుతూ 1954 నుంచి 1968 వరకు మార్టిన్ లూథర్ కింగ్ నాయకత్వాన పౌరహక్కుల ఉద్యమం ఉవ్వెత్తున లేచింది. స్వేచ్ఛ, ఉపాధికోసం వాషింగ్టన్‌కు జరిగిన ప్రదర్శనతో నాటి అధ్యక్షుడు జాన్ కెన్నడీ, తరువాత లిండన్ జాన్సన్ ప్రభుత్వాలు ఇంకా మిగిలి ఉన్న వివక్ష రూపాలను నిషేధిస్తూ, ఓటింగ్ హక్కులను కల్పిస్తూ చట్టం చేయాల్సి వచ్చింది. ఆతరువాత నల్లజాతీయుల సాధికారత ఉద్యమం మరికొన్ని విజయాలను సాధించింది.అయితే ఇది కొంతమంది ఆఫ్రో-అమెరికన్లు ధనవంతులు కావటానికి, ప్రభుత్వాలలో పదవులు పొందటానికి దోహదపడింది తప్ప నిజమైన సాధికారత రాలేదు. గతేడాది జరిగిన ఎన్నికలలో నల్లజాతీయుడైన బరాక్ ఒబామా అధ్యక్షుడైనప్పటికీ పెద్దగా ఒరిగేదేమీ లేదని జరుగుతున్న పరిణామాలు వెల్లడిస్తున్నాయి. ఒబామాకు మిగతా అధ్యక్షులకు ఉన్న తేడా ఫిడెల్ కాస్ట్రో మాటల్లో చెప్పాలంటే మాటల చతురత మాత్రమే. ఒబామా సౌమ్యంగా మాట్లాడితే మిగతావారు కట్టెవిరిచిపెట్టినట్లు ప్రవర్తించారు. అంతకు మించి విధానాల్లో ఎలాంటి మార్పు లేదు.

★

క్రైమ్ కథ

భూత్ బంగ్లా!

- యర్నాగుల సుధాకరరావు

"**సార్** చాలా పాతకాలం బిల్డింగ్ మీరు కొన్నారు. మొత్తం పడగొట్టి కొత్తగా బిల్డింగ్ కట్టాలనుకుంటున్నారు. ఇక్కడివారంతా భూత్ బంగ్లా అనే అంటారు. పన్నెండేళ్లపాటు కోర్టులో కేసు నడిచింది. ఈబిల్డింగ్ ఎలాగైనా దక్కించుకోవాలని మస్తాన్‌రావు ఎంత ఖర్చు చేసినా ఫలితం లేకపోయింది. వేరేవారికి వెళ్లిపోయింది. వారు అమ్మేసి వెళ్లిపోయారు. ఇది సార్ టూకీగా దీనికథ" చెప్పాడు డాక్యుమెంట్ రైటర్.

"ఈబిల్డింగ్ తీరు చూస్తే ఎవరో జమిందార్లున్నట్టుగానే ఉంది. పది సెంట్ల స్థలంలో నిర్మితమైంది. ఆలనాపాలనా లేక కొంత భాగం కూలిపోయింది. సరే నేను పోలీస్ డిపార్టుమెంటులో రిటైర్ అవుతున్నాను. చివరిలో ఎక్కడో చోట సెటిల్ కావాలి. ఇక్కడే చిన్ని ఇల్లు కట్టుకుంటే సరిపోతుంది. నాలుగైదు గదుల ఇల్లు చాలు" చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

"మీరన్నట్లు జమిందార్లు లాంటివారే ఇందులో ఉండేవారు. అయితే ఆస్తులకోసం కొడుకులు అల్లుడు మధ్య గొడవలు అయ్యాయి. పెద్ద కొడుకు శ్రీధర్ ఊహించనివిధంగా మాయమయ్యాడు. రెండో కొడుకు చందూ కోర్టులో గెలుచుకుని మీకు గత ఏడాది అమ్మేసాడు. అతడు నాలుగు మాసాల క్రితం చనిపోయాడు. వారి ఆస్తులు బాగా కరిగిపోయి వేరే ఊరికి వెళ్లిపోయారు. ఇక మస్తాన్‌రావు మొదట్నించి నేరగాడే. బాగా సంపాదించుకున్నాడు. ఇప్పుడు రకరకాల వ్యాపారాలు చేసుకుంటున్నాడు. అయితే ఈఇంటి పెద్దకొడుకు అదే మిస్ అయిపోయాడే! అతడుంటే మస్తాన్ ఆటలు సాగేవికావు" చెప్పి వెళ్లిపోయాడు డాక్యుమెంట్ రైటర్.

భూత్‌బంగ్లా పడదోయించడానికి ముందు తాళం తెరిచి లోపలకు వెళ్లాడు ఇన్‌స్పెక్టర్.

పాతకాలపు కర్రబీరువా ఉంది. దాని తాళం లాగితే వచ్చేసింది. తలుపు తెరవగానే బీరువాలోంచి పెద్దపాము బుస్సుమంటూ వచ్చింది. అది కిందకు దిగి పాక్కుంటూ బీటలువారిన గదిగోడల్లోంచి వెళ్లిపో యింది. బీరువా వెనుకభాగం దెబ్బతింది. అరలో పాతకాలపు లక్కబొమ్మలున్నాయి. ఆపక్కనే పదునైన కత్తి, ప్లాస్టిక్ కవర్‌లో చుట్టబడిన దుస్తులున్నాయి ఎందుకో అనుమానంగా వాటిని తీసాడు. ఒకషర్టు కనిపించింది. దానిమీద నల్లని మచ్చలున్నాయి.అవి రక్తపుమరకలని ఇట్టే పోల్చుకున్నాడు. కత్తిని తీసి పరీక్షగా చూసాడు. నల్లని మరకలు కన్పించాయి. ఇన్‌స్పెక్టర్ వాటిని అలాగే అదే ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి పక్కనే ఉన్న విరిగిన టేబిల్‌మీద పెట్టాడు. బీరువా పగుళ్లలో ఒకేఒక ఉత్తరం కన్పించింది. దాన్ని తెరిచి చూసాడు.

> నీఆస్తులు కాపాడుకో. ఎవడో మొన్నకాక నిన్న వచ్చిన అల్లుడు మస్తాన్‌రావు పెత్తనం ఏమిటి? ఆఇంట్లో మేమంతా పుట్టిపెరిగాం. ఆఇంటిని ఎలాగైనా నీవు దక్కించుకో! నీతమ్ముడు అసమర్థుడు. నీవే ఎలాగైనా దక్కించుకో!

శ్రీధర్‌కు, నీ అత్త వ్రాయునది

నీఆస్తులు కాపాడుకో. ఎవడో మొన్నకాక నిన్న వచ్చిన అల్లుడు మస్తాన్‌రావు పెత్తనం ఏమిటి? ఆఇంట్లో మేమంతా పుట్టిపెరిగాం. ఆఇంటిని ఎలాగైనా నీవు దక్కించుకో! నీతమ్ముడు అసమర్థుడు. నీవే ఎలాగైనా దక్కించుకో! అన్నట్లు నీవు కోర్టులో ఇంటికోసం కేసువేస్తే నిన్ను బతకనీయడు ఆ మస్తాన్. వాడు ఒట్టి రాలుగాయి. జాగ్రత్తగా ఉండు. నేను వచ్చి నీతో మాట్లాడదామంటే ఇక్కడ నాకు సవాలక్ష అడ్డంకులు. మీమావయ్య మీతో మాట్లాడనీయరు. ఎలా చచ్చేది? అందుకే పుట్టింటి మమకారంతో నీకు ఈఉత్తరం రాస్తున్నాను. నువ్వు ఆఇంటిలో ఒంటరిగా ఉండవద్దు. నీవు ఇప్పటికైనా నీభార్యాపిల్లలను పుట్టింటి నుంచి తీసుకుని వచ్చేసి నీకు నీతండ్రి ఇచ్చిన కొత్త ఇంట్లో కాపురం పెట్టుకో! భార్యతో నిత్యం కొట్లాటలు ఎందుకు? మన పాతిల్లును దక్కించుకో! మీనాన్న అల్లుడికి గిఫ్టుగా ఇచ్చినట్టు కోర్టులో వాడు ఫోర్జరీతో చూపిన కాగితాలు వెలవెలబోతాయి. అవసరమైతే కోర్టులో మేము వచ్చి సాక్ష్యంచెప్పేలా చెయ్. నేను సాక్ష్యం చెబుతాను.

ఇట్లు నీఅత్త.

ఆఉత్తరం పదేపదే చదివి ఇన్‌స్పెక్టర్ మస్తాన్‌రావును అనుమానించాడు. తప్పిపోయిన శ్రీధర్ హతుడయ్యాడన్న నిర్ణయానికి వచ్చాడు. వెంటనే ఆబంగ్లాలో ఎక్కడో ఒకచోట శ్రీధర్‌ను పాతేసి ఉంటాడని ఆనవాళ్లకోసం వెతికాడు. స్టోర్ రూమ్‌గా ఉన్న గదికూడా బాగా పాడయి ఉంది. అందులోకి తొంగి చూసాడు. కాలిపోయి ఒకింత మిగిలిన కర్రలు కన్పించాయి. మరీ పరీక్షగా చూస్తే అక్కడ ఛిద్రమైన పుర్రె కన్పించింది. ఇక ఉపేక్షించకుండా పోలీసులను రప్పించి మరింత లోతుగా పరిశీలించాడు. కుడిచేతి ఎముకలు పుర్రె భాగం దొరికాయి. వాటితోపాటు దుస్తులు, కత్తిని లాబ్‌కు పంపాడు. 'పక్కా హత్య' అని రిపోర్టులలో తేలింది. పోలీస్‌స్టేషన్‌లో పాత రికార్డులు తీయగా శ్రీధర్ మిస్సింగ్‌కేసు ఫైలయ్యింది. ఆ ఫిర్యాదు చేసింది మస్తాన్‌రావే. వెంటనే మస్తాన్‌రావును అదుపులోకి తీసుకుని ఇన్‌స్పెక్టర్ ప్రశ్నించాడు.

మస్తాన్ తొలుత కాదన్నాడు. "శ్రీధర్ ఎవరితో సరిగా ఉండే వాడు కాడు. భార్యతో తగవులుపడి చివరికి ఆమెను వదలేసాడు. పిచ్చి వాడిలా ఎటో వెళ్లిపోతే నేను అతడికోసం గాలించాను"

"శ్రీధర్‌కి ఎవరూ లేకపోవడం ఆఇంటికోసం కోర్టులో నీపైకేసు వేయడంతో అతడిని చంపేసి ఆఇంట్లో స్టోర్ రూమ్‌లో తగలెట్టేసావు. అయితే కొన్ని బొమికలు ఇప్పటికీ అక్కడ ఉన్నాయి. నీషర్టు రక్తసిక్తమయ్యిందని కత్తితోబాటు అక్కడే బీరువాలో దాచేసావు. ఆతరువాత కోర్టులో శ్రీధర్ తమ్ముడు చందూ కేసును కొనసాగించడంతో ఆఇంటిని సీజ్‌చేసారు. ఆఖరిలో ఆఇల్లు చందూకి రావడం అతడు నాకు అమ్మడం నేను నాపోలీస్‌బుద్ధితో తీగ లాగడం నీహత్యా డొంక కదలడం జరిగి పోయింది" ఇన్‌స్పెక్టర్ చెప్పి మస్తాన్ కళ్లలోకి చూసాడు.

"రెండేళ్లతో ముగిసిన కేసును మరి పదేళ్ల తరువాత తవ్వి తీసి నామెడకు చుట్టావు ఇన్‌స్పెక్టర్. నిజమే ఆరోజు శ్రీధర్‌ను ఎంతగానో బతిమాలాను. అతడు కోర్టులో కేసు విత్‌డ్రా చేసుకోనని చెప్పాడు. వాడిని కోపంతో కత్తితో పొడిచాను. శవాన్ని ఎలా వదిలించుకోవాలో తెలియక స్టోర్‌రూమ్‌లో కాల్చేసాను. బయట రోడ్లు సందడిగా ఉన్నందున అర్ధరాత్రి వరకు ఉండి కాలిపోయిన శవాన్ని చూడడానికి భయపడి రక్తపుమరకలున్న నాషర్టును బీరువాలో పెట్టేసాను. ఆతరువాత చందూ అన్న తరుపున కేసు కొనసాగించాడు. ఇల్లు సీజ్ చేశారు. పన్నెండేళ్లు గడిచాయి. నేను ఆశవం విషయమే మరిచాను. తీరా బొమికలు బూడిద కూడా నామెడకు ఉరి బిగించాయి" అని తల పట్టుకున్నాడు.

★

నల్లా నల్లని పండు

- డా॥ విజయ్

పండ్లలో రాజు మామిడి కన్నా కొన్ని సార్లు నేరేడు ఖరీదు. మామిడి రుచి దీనికి ఉండకపోవచ్చు కానీ ప్రజలు నేరేడుని వదలరు. అందుకు ఒక కారణం వుంది. మామిడి తీపి చక్కెర వ్యాధి వున్న వారికి చేదు వార్తే. కానీ నేరేడు వగరు మాత్రం వారికి తియ్యటి శుభవార్త. చాలా మంది డయాబెటిస్ వ్యాధికి నేరేడు మహత్తరమైన మందులా భావిస్తారు. కానీ నిపుణులు అంతలా నమ్మడానికి వీల్లేదంటున్నారు.

అయినా నేరేడులోని విశేషమైన ఆమ్లాలు - ఆక్సాలిక్ ఆమ్లం, మాలిక్ ఆమ్లం వంటివి ఆ పండుకి ప్రత్యేకమైన రుచిని ఆపాదిస్తాయి. పచ్చికాయలను వెనిగర్ తయారు చేయడానికి వాడితే, పండిన వాటితో సాస్‌లు చేస్తారు.

వేసవి వేడి కాస్త తగ్గాలా వద్దా అన్నట్టుంది వాతావరణం. వర్షాలు ముంచెత్తవలసిన సమయంలో ఇంకా వేడి చిటపటమంటూనే వుంది. అయినా ఒక విశేషమైన పండు చవులూరిస్తూ దర్శనమిస్తోంది. అదే నేరేడు.

అది నలుపూ కాదు, వంగ రంగూ కాదు. ఆరెండింటి కలయికలో నిగనిగలాడుతూ నేరేడు చూడడానికే భలే వుంటుంది. దాని రుచీ అంతే. అటు తీపీ కాదు, పూర్తిగా వగరూ కాదు. అదో రకమైన గమ్మత్తైన రుచి. అది తింటే నాలుకపై ముదురు నీలం రంగు మరకలా కొద్ది సేపు వుండిపోతుంది. చూడడానికి పెద్ద గోళీకాయలంత కనిపించే నేరేడులో ఎక్కువ కండ వుండదు. సింహభాగం చేదు, గట్టి గింజే! పైగా అదేం చవక కాదు. అయినా సరే నేరేడు పండు తినకుండా వుండటం చాలా కష్టం.

చాలా పళ్లని కోసిన తర్వాత ఉప్పుగానీ, చక్కెరగానీ, కారంగానీ చల్లుకుని తింటారు. కానీ నేరేడు పళ్లపైన ఉప్పు చల్లుకుని, అమాంతం ఒక్కో పండూ నోట్లో పెట్టుకుని, విచిత్రమైన రుచులను ఆస్వాదించడమే ఒక అనుభూతి.

పండ్లలో రాజు మామిడి కన్నా కొన్ని సార్లు నేరేడు ఖరీదు. మామిడి రుచి దీనికి ఉండకపోవచ్చు కానీ ప్రజలు నేరేడుని వదలరు. ఆందుకు ఒక కారణం వుంది. మామిడి తీపి చక్కెర వ్యాధి వున్న వారికి చేదు వార్తే. కానీ నేరేడు వగరు మాత్రం వారికి తియ్యటి శుభవార్త. చాలా మంది డయాబెటిస్ వ్యాధికి నేరేడు







మహత్తరమైన మందులా భావిస్తారు. కానీ నిపుణులు అంతలా నమ్మడానికి వీల్లేదంటున్నారు.

అయినా నేరేడులోని విశేషమైన ఆమ్లాలు - ఆక్సాలిక్ ఆమ్లం, మాలిక్ ఆమ్లం వంటివి ఆ పండుకి ప్రత్యేకమైన రుచిని ఆపాదిస్తాయి. పచ్చికాయలను వెనిగర్ తయారు చేయడానికి వాడితే, పండిన వాటితో సాస్‌లు చేస్తారు.

జన్మస్థలం మనదేశమే!

నేరేడుకి జన్మస్థలం మన దేశమే అంటారు. పక్కనేవున్న బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో కూడా ఇది కనిపిస్తుంది. అసలు మన దేశం పేరే ఈ పండు పేరు - నేరేడును 'జాంబున్' అంటారు. కాలక్రమేణా అది 'జామూన్'గా మారింది. కానీ పురాతన కాలంలో మన దేశంలోని ఓ ప్రాంతాన్ని 'జంబూ ద్వీపం' గా పిలవడానికి కారణం నేరేడేనంటారు.

అప్పట్లో సీతారాముల ఆహారం!

మన ఇతిహాసాల్లోనూ నల్లనేరేడుకి ప్రముఖ స్థానమే వుంది. పధ్నాలుగేళ్ల వనవాసంలో సీతారాములు నేరేడు పళ్లనే తింటూ జీవించారని కొందరి అభిప్రాయం!

జూన్ మాసపు పండు

నేరేడు చెట్టుకీ యూకలిప్టస్ చెట్టుకీ కొన్ని పోలికలున్నాయి. ఆకుల వాసన టర్పెంటైన్‌లా వుంటుంది. అలాగే కలప గట్టిగా వుంటుంది. రైల్వేలో స్లీపర్ల కోసం ఈ చెక్కనే వాడతారు. దాదాపు 30-35 అడుగుల ఎత్తు పెరిగే నేరేడు చెట్టు మార్చి - ఏప్రిల్ మధ్యలో పూతకొస్తుంది. జూన్ నుండి పండ్లు లభిస్తాయి. అన్ని పళ్లలాగే నేరేడు కాయ ముందు ఆకుపచ్చగానే వుంటుంది. కానీ పోను పోనూ లేత వంగ రంగు, ఆతర్వాత ముదురు రంగుల్లోకి మారుతుంది. తెల్ల నేరేడు జాతీ వుంది.

రంగు మారుద్ది మరి

బాగా పండిన నేరేడు కండ చూడడానికి ఇంకు మరకలు పడ్డ తెల్లటి పదార్థంలా వుంటుంది. పల్చటి పైపొరలో మాత్రమే చిక్కటి రంగు వుంటుంది. ఆ రంగుని మరింత ఆకర్షణీయంగా చేయడానికి అమ్మేవాళ్లు నూనె పూస్తారు. కాబట్టి మార్కెట్లో కొన్న పండ్ల పట్ల కాస్త జాగ్రత్త అవసరం. వాటిని ఉప్పు కలిపిన నీటిలో శుభ్రంగా కడిగితే ఆరోగ్యానికీ మంచిది. రుచీ బావుంటుంది.

ఎన్నో ఉపయోగాలు

నేరేడు జీర్ణశక్తిని పెంచుతుంది. దీనిలో విటమిన్ ఎ, సి పుష్కలంగా లభిస్తాయి. కాల్షియం కూడా వుంటుంది. ఇంతకు ముందు చెప్పుకున్నట్లు డయాబెటిస్ వున్న వారిలో నేరేడు చక్కెరను నియంత్రిస్తుందంటారు గానీ కచ్చితంగా నిరూపణ కాలేదు. అయితే నేరేడుని ఆయుర్వేద, యునానీ, చైనీస్ వైద్య శాస్త్రాల్లో విస్తృతంగా వాడతారు. నేరేడు ఆకులు రక్తపోటుని నియంత్రించడానికి వాడతారు.

నేరేడు ఫిలిప్పీన్స్, మయన్మార్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల్లోనే కాక అమెరికాలోని ఫ్లోరిడాలో కూడా కనిపిస్తుంది. అయితే అమెరికాలో ఈ పండు 1911లో ప్రవేశపెట్టబడింది. మన దేశం నుండి బ్రెజిల్ కి కూడా ఈ పండు వ్యాపించింది. ఇవండీ నోరూరించే నేరేడు పండు సంగతులు.

పై వారం మరో రకం పండుతో కలుసుకుందాం.



ఆరోగ్యం

పిల్లలు - మానసిక సమస్యలు



మెదడులో భౌతికంగా జరిగే రసాయనిక మార్పుల వల్ల మానసిక రుగ్మతలు వస్తుంటాయి. అయితే ప్రస్తుతం వైద్యశాస్త్రంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. ఆధునిక వైద్య సేవల ద్వారా అపోహలను తొలగించుకుని మానసిక రుగ్మతలను నివారించవచ్చు. అసలు ఇవి ఎన్ని రకాల రూపాల్లో వస్తాయి? వాటి నివారణా చర్యలేవి? వంటి విషయాలు ఈ వారం తెలుసుకుందాం.

మానసిక జబ్బులు రావడానికి వయసుతో నిమిత్తం లేదు. మానసిక వ్యాధులు వివిధ సమస్యల వల్ల వస్తాయి. చిన్న పిల్లల్లో మానసిక మార్పులకు ప్రవర్తన లోపమని భావించి పిల్లల పట్ల కఠినంగా వ్యవహరించకూడదు. దీనివల్ల పిల్లల భవిష్యత్తుకు ఆటంకం ఏర్పడుతుంది. ఇటీవల కాలంలో స్కూలుకు వెళ్లే పిల్లల్లో ఎలాంటి మానసిక రుగ్మత లేకున్నా ఉన్నట్లుండి శ్వాసలో ఇబ్బంది కలిగి ఆస్తమా ఉన్నట్లు ప్రవర్తించడం, ఫిట్స్‌లాగా రావడం చూస్తుంటాం. మందులతో నయంకాని విధంగా తరుచూ వాంతులు, కడుపునొప్పి, తలనొప్పి వస్తుంటాయి. ఇలాంటి లక్షణాలు రావడానికి ముఖ్యకారణం పిల్లల్లో ప్రీకాన్సియస్ మైండ్‌లో కలిగే ఒత్తిడే. ఇలాంటి సమస్యలు ఉన్నప్పుడు తగిన వైద్యసలహాలతో పాటు ఒత్తిడికి గల కారణాలు వారిని అడిగి తెలుసుకోవడం వల్ల పిల్లలను ఈ మానసిక రుగ్మతల నుంచి దూరంగా ఉంచవచ్చు.

డాక్టరు ఎండ్లూరి ప్రభాకర్,
మానసిక వైద్యులు,
ప్రశాంతి మైండ్ కేర్ హాస్పిటల్,
అనంతపురం.
9848316994

చదువుల విషయంలో పిల్లల మీద ఒత్తిడి పెరిగిపోయి జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాలన్న తపన పిల్లల్లో పెరుగుతూ ఉంది. తల్లిదండ్రులు దానిని పెంచిపోషిస్తున్నారు. చదువుల విషయంలోను, తల్లిదండ్రుల్లోనూ మానసిక సంఘర్షణ పెరిగిపోయి ఒక్కో సందర్భంలో పిల్లలు క్షణికావేశంతో ఆత్మహత్యలకు ప్రయత్నిస్తారు. తల్లిదండ్రులు ఇలాంటప్పుడు ఎంతో సమన్వయంతో సున్నితంగా ప్రవర్తిస్తే వాటిని నివారించవచ్చు. యుక్త వయస్కుల్లో ఆత్మహత్యలకు చాలా వరకు ప్రేమ, లైంగిక విషయాలు కారణాలుగా కనిపిస్తాయి. పెళ్లి తర్వాత తరుచూ ఘర్షణలు జరగడం, పట్టింపులకు పోవడం, అత్తాకోడళ్ల మధ్య సమన్వయం లేకపోవడం, సహనం కోల్పోయి క్షణికావేశంతో ఆత్మహత్యలకు ప్రయత్నించడం, డిప్రెషన్‌తో బాధపడి అదేమార్గాన్ని ఎంచుకోవడం వంటివి చూస్తుంటాం. వాటి నివారణకు రకరకాల పద్ధతులు, సలహాలు, ఆధునిక వైద్యం అందుబాటులో ఉంది. ఆత్మహత్యల ఆలోచనల నుంచి బయటపడి, ఇందుకు దారితీసే మూలకారణాల పరిష్కారం వైపు దృష్టి సారించాలి.

పిల్లల్లో మానసిక రుగ్మతలు

ఆటిజం

పుట్టినప్పటి నుంచి మూడేళ్ల వయసులోపు పిల్లలకు ఇది వస్తుంది. ఈ జబ్బు వచ్చిన పిల్లలు శారీరక ఎదుగుదల సాధారణంగా ఉన్నప్పటికీ, మానసికంగాను తెలివితేటలు లేకుండా కన్పిస్తారు. మాటలు రావడం ఆలస్యం అవుతుంది. మాటల్లో స్పష్టత ఉండదు. తరుచూ ఏదో ఆలోచిస్తుంటారు. ఎవరితోనూ కలవరు. శారీరక భంగిమలు అసాధారణంగా ఉంటాయి. తల్లికోసం ఆరాటం కన్పించదు. తలలు బాదుకోవడం, తమను తాము హింసించుకోవడం ఇతరుల కళ్లల్లోకి చూసి మాట్లాడలేకపోవడం, వస్తువులతో ఎక్కువసేపు ఆటలు ఆడుకోవడం అందులో నిమగ్నమై ఉంటారు.

హైపర్ కైనటిక్ డిజార్డర్

ఇది చాలామంది పిల్లల్లో ఉంటుంది. ఒక చోట ఒక నిమిషం కూడా ఏకాగ్రతగా ఉండలేక అటు ఇటు తిరుగుతూ కాళ్లుచేతులు కదలాడిస్తూ ఉంటారు. ఇంట్లో వస్తువులు పాడు చేస్తూ, ప్రమాదకరమైన పనులు చేస్తూ ఇంట్లోవారిని ఇబ్బంది పెడుతుంటారు. చదువు పట్ల ఏకాగ్రత లోపిస్తుంది. ఇది నాలుగేళ్ల నుంచి ఏడేళ్ల వయస్సు పిల్లల్లో సంభవిస్తుంది.

డిప్రెషన్

పిల్లల్లో పెద్దవారిలాగా కాకుండా డిప్రెషన్ అనేది గుర్తించలేని విధంగా ఉంటుంది. పిల్లలు, ఎప్పుడూ దిగులుగా ఉందని, మనస్సు బాగా లేదని

చెబుతుంటారు. అన్నం సరిగా తినకపోవడం, డల్‌గా కనిపించడం , విసుగు చెందడం, చదువుపై ధ్యాస లేకపోవడం ఈ వ్యాధి ప్రధాన లక్షణాలు.



కాండక్ట్ డిజార్డర్

ప్రస్తుత పరిస్థితుల్లో తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను తోటి విద్యార్థులను మరియు సమాజాన్ని ఇబ్బందిపెట్టే అతి ముఖ్యమయిన జబ్బు ఈ కాండక్ట్ డిజార్డర్. ఇది 6 నుంచి 12సంవత్సరాల వయస్సు పిల్లలలో కన్పిస్తుంది. ఈ డిజార్డర్ ఉన్న పిల్లలు తరచూ తల్లిదండ్రులతో గొడవ పడుతుంటారు. తల్లిదండ్రుల మాట వినకపోవడం, చిన్నచిన్న విషయాలకు అబద్ధాలు చెప్పడం, చెప్పకుండా డబ్బులు తీయడం, పెంపుడు జంతువులను క్రూరంగా హింసించడం, చెప్పకుండా ఇంటినుంచి, స్కూలునుంచి పారిపోవడం, హెచ్చరించినపుడు క్షణికావేశానికి లోనయి ఆత్మహత్యలకు ప్రయత్నించడం చేస్తారు. ఇలాంటి పిల్లల్ని తల్లిదండ్రులు ప్రత్యేకమయిన పద్ధతులు మరియు కౌన్సిలింగ్ తీసుకోని సరయిన మార్గంలో పెట్టవచ్చు. ఈజార్డర్‌ను నిర్లక్ష్యం చేసినట్లయితే భవిష్యత్తులో పర్సనాలిటీ డిజార్డర్‌గా మారి అసాంఘిక కార్యకలాపాలు చేస్తారు. కుటుంబపరంగా ఎప్పటికీ సర్దుకోలేక ఇతరులను ఇబ్బంది కలిగిస్తుంటారు. పైన వివరించిన సమస్యలను జాగ్రత్తగా గమనించి బిహేవియర్ మరియు కౌన్సిలింగ్ ద్వారా చాలా వరకు అధిగమించవచ్చు.

లెర్నింగ్ డిజార్డర్ (డిస్‌లెక్సియా)

ఈ సమస్య వున్న పిల్లలు చదువు నేర్చుకునే విషయంలో మొదటి నుంచి చాలా నిదానంగా ఉంటారు. నేర్చుకునే వాక్యాలను, పదాలను, తప్పుగా పలకటం, పదాలను తప్పించడం, ప్రత్యామ్నాయ పదాలను మధ్యలో చేర్చడం ఉంటాయి. పదాలను తిప్పిచూస్తారు. నిదానంగా చదువుతారు. ఇలా ఉన్న పిల్లలను మనం గమనించకుండా పిల్లలపైన వత్తిడి పెంచినట్లయితే చదువు పట్ల ఆసక్తి తగ్గిపోయే అవకాశం ఉంది.

పక్క తడపటం

పిల్లలు 5 సంవత్సరాల తరువాత కూడా తమకు తెలియకుండానే నిద్రలో పక్క తడిపినట్లయితే దానిని బెడ్ వెట్టింగ్ అంటారు. దీనిని టాయిలెట్ ట్రెయినింగ్ ద్వారా నివారించవచ్చు.

ఫోనోలాజికల్ డిజార్డర్స్

కొంతమంది పిల్లలలో బాషాపరమైన నైపుణ్యాలు నార్మల్‌గా ఉన్నప్పటికీ పలికే విధానంలోను, అర్థం చేసుకునే విధానంలోను లోపాలుంటాయి. వాటిని గమనించి చిన్న వయస్సులోనే సరిదిద్దినట్లయితే వెనుకబడి పోకుండా జాగ్రత్త పడవచ్చు.

బుద్ధిమాంద్యం

ఐక్యు 70శాతంకన్నా తక్కువ ఉన్న పిల్లలను బుద్ధిమాంద్యపు పిల్లలు అంటారు. మైల్డ్ మెంటల్ రిటార్డేషన్ ఉన్న పిల్లల పట్ల (ఐక్యు 50 - 69) టీచర్స్ మరియు తల్లిదండ్రులు ప్రత్యేకశ్రద్ధ చూపి ప్రత్యేక పద్ధతుల ద్వారా వీరిని అందరి పిల్లలు లాగే చదువులో అభివృద్ధి చేయవచ్చు. బుద్ధిమాంద్యం పిల్లల్లో చాలా మందికి అసాధారణ లక్షణాలు ఉంటాయి. మొదటి వాటిని ప్రత్యేక పద్ధతుల ద్వారా పోగొట్టినట్లయితే చదువు పట్ల ఆసక్తి పెరుగుతుంది.

అభద్రత

తెలివితేటలు తక్కువగా ఉన్న పిల్లలు, అభద్రతా భావానికి గురైన పిల్లలు, గృహహింసకు గురైన పిల్లలు, ఇంటి వాతావరణం సరిగా లేని పిల్లలు, వ్యర్థ పదార్థాలైన బంకమట్టి, పెయింట్, సున్నం, బలపాలు లాంటివి తింటారు. వారికి ప్రత్యేకమైన బిహేవియర్ పద్ధతుల్లో మాన్పించవచ్చు.

పైవిషయాలను గమనించి పిల్లల ప్రవర్తన, వారికున్న తెలివితేటల ఆధారంగా పాఠశాలను ఎంపిక చేసుకోవడం ఉపాధ్యాయులతో తరచు పిల్లల ప్రవర్తనను చర్చించడం వంటి కొన్ని పద్ధతులను పాటించినట్లయితే చాలావరకు పైసమస్యలను అధిగమించవచ్చు. ★

పోస్టీనా...!

'పోస్ట్ డబ్బాలో ఏముంటాయ్!'

'......'

'ఏంటండీ బాబూ! అలా కొట్టేట్టు చూస్తున్నారు?'

'మీరడిగిన ప్రశ్నకు అలాంటి రియాక్షనే వస్తుంది మరి'

'కూల్ కూల్! తమాషాగా అడుగుతున్నామనుకొని చెప్పొచ్చుకదా'

'ఓకే..అలా అన్నారు కాబట్టి...చెప్తున్నాం.. పోస్ట్‌కార్డులు, ఎన్వలప్ కవర్లు...'

'ఆ...అన్నట్టు మీరు వాటితోపాటు పిల్లిపిల్లను కూడా చేర్చాలి. మర్చిపోయారా?'

'లూజ్ టాక్ తట్టుకోలేకపోతున్నాం. ఆపండి బాబూ! పోస్ట్ డబ్బాలో పిల్లి పిల్లేంటి?'

'సారీ బాబా సారీ! మేం చెప్తోంది నిజం. అమెరికాలో కూడా ఇదే అంటున్నారు జనం. పదిరోజుల క్రితం బోస్టన్‌లోని ఒక పోస్ట్ డబ్బాలో ఉత్తరాలతోపాటు పిల్లి పిల్ల దర్శనమిచ్చింది. అందుకని దానికి 'పోస్టీనా' అని పేరు కూడా పెట్టేశారు..'

'నిజంగానా!'

'పోస్ట్ డబ్బాలో దర్శనమిచ్చిన పిల్లి పిల్ల తోడు. అది రెండు పౌండ్ల బరువుంది. ఎనిమిది వారాల వయస్సుంది. దాన్ని ఇప్పుడో జంట పెంచుకుంటోంది. వారు మాత్రం దానికి 'పి.డి' అని పేరు పెట్టేశారు. అన్నట్టు పి.డి అంటే ఏంటో చెప్పలేదుకదా. 'పోస్టేజ్ డ్యూ'. ఎవరు చేసిన కోతి పని ఫలితంగానో అది పోస్ట్ డబ్బాలో పడినా! చివరికి ఒకింటిదైంది. ఏమంటారు?!'



కథ

చాలా దూరం దాకా...



హిందీ మూలం : డా॥ శీతేష్ అలోక్

అనువాదం : సి.హెచ్. శ్రీనివాసమూర్తి

చేయి చాపి, టీకప్పునందుకుంటూ ప్రతిభ ముఖంలోకి చూశాను. ఎందుకో ఆమెలో కొంత చిరాకు కనిపించింది. మనసులో మెదిలే భావాలు మొఖంలోకి పాకుతాయంటారు. ఏదైనా సమస్యో, ఇబ్బందో ఆమెను బాధిస్తోందిలావుంది.

"ఏమిటలా వున్నావ్?" టీ తాగుతూ అడిగాను.

"ఎలా వున్నాను" – బహుశా ఎలా చెప్పాలోనని ఆలోచిస్తుందేమో. ఆమె బదులిచ్చిన తీరు చూస్తుంటే. గంభీరమైన సమస్య కాకపోయినా, ఏదో ఆమెను వ్యాకులపరుస్తోందని అర్థమైంది. బహుశా అది అప్రియమైన విషయమేమో!

"మళ్ళా వారం రోజులు అంట్లు తోమటం తప్పేట్లు లేదు" నిట్టూర్పు విడుస్తూ అన్నది. "ఇప్పుడీమె కూడా మొదలు పెట్టింది. ఎప్పుడు బడితే అప్పుడు సెలవు కావాలని" – నాకు విషయం అర్థమైంది.

సుమారు మూడు నెలల క్రితం దుర్గ పనిలో చేరినప్పుడు ప్రతిభ హాయిగా ఊపిరి పీల్చుకొంది. ఆమె చాలాకాలం నవ్వుతూ కనిపించక పోవటం నాకు తెలుసు. విరజ పని మానేసి వెళ్ళి పోయిన తర్వాత మూడు నెలలు చాలా కష్టంగా గడిచాయి. నిజానికీ కష్టాలు విరజ పోకముందు కూడా వున్నాయి. అకస్మాత్తుగా మా కాలనీ వెనుక మైదానంలో వున్న గుడిసెల తొలగింపు ప్రారంభమైంది. వాళ్ళందరికి ఏడెనిమిది మైళ్ళ దూరంలో పునరావాసం కల్పిస్తారట. అందులో విరజ గుడిసె కూడా వుంది. పోతూ పోతూ "మీ ఇంట్లో మాత్రం పని మానేయనమ్మగారూ!" అని భరోసా ఇచ్చింది. బస్సులోనైనా వచ్చి, పని చేసి పోతానంది. బాధ పడాల్సిన అవసరం లేదని సాంత్వన ఇచ్చింది.

"రోజూ బస్‌లో వస్తుందట. బస్ కిరాయి మనమే ఇవ్వాలిగా. రోజుకు రెండు రూపాయలంటే నెలకు అరవై రూపాయలు" నా మనసేమిటో తెలుసుకోవాలనే వుద్దేశంతో అంది ప్రతిభ. నెలవారీ బస్ పాస్ లిస్తారు. ఆమెతో చెప్పు" అన్నాను వ్యాపారజ్ఞానాన్ని ఉపయోగిస్తూ. కాని విరజకు ఈ వ్యాపార ధోరణి నచ్చలేదు.

"అమ్మగారూ! మాలాంటి గరీబోల్లకు పాసు లెవరిస్తారు? ఆ చదువుకున్నోల్లతో మేము తంటాలు పడలేము. ఫారం నింపటానికి పది రూపాయలు, సంతకం పెట్టడానికి ఐదు రూపాయలు. దీనికంటే రూపాయి పారేసి బస్సెక్కి రావటమే మేలు" అనిందట.

ఆమె మాటలు కూడా కొంత వరకు నిజమే. మరో మార్గం లేక పాసు తీసిచ్చే బరువు నా నెత్తి మీదేసుకున్నాను. ఆఫీసు చుట్టూ రెండు మూడు ప్రదర్శనలు చేసిన తర్వాత పాసు సంపాదించాను గానీ. విరజ మాత్రం జీతం పెంచమనే హఠం మాత్రం మానలేదు. "మీరే ఆలోచించండమ్మగారూ! బస్‌లో రావటం పోవటం ఎంత టైము పడుతుంది. నిల్చుని నిల్చుని కాళ్ళు నొప్పులు పుడతాయి. ఇక ఆ తోపులాటలు చెప్పక్కరలేదు" అంటూ మొదలు పెట్టింది.

ఆమె తర్కంలో దమ్ముంది. ఓడిపోయి ఆమె జీతాన్ని మరో నలభై రూపాయలు పెంచక తప్పలేదు. కాని సమస్య అంతటితో సమసిపోలేదు. నాగాలు పెట్టటం మొదలయింది. కారణమడిగితే ఒకరోజు గంట నిల్చున్నా బస్ రాలేదంటుంది. దారిలో బస్ ఆగిపోయిందంటుంది. తొక్కిసలాటలో కాలు నలిగి, వాచి, రెండు మూడు రోజులు నడవలేకపోయానంటుంది. వర్షాలమూలాన గుడిసెల్లోకి నీళ్ళొచ్చాయంటుంది. నాగాలు ఇది వరకు కూడా పెడుతుండేది గానీ, దూరంగా పోయినతర్వాత ఆమె పనికొచ్చిన రోజులకంటే రానిదినాలే ఎక్కువైనాయి. విధిలేక ఆమెను పనిలోనుండి తీసివేయాల్సి వచ్చింది. కాని మరొకరు దొరకటం అంత తేలికైన విషయంకాదు. దుర్గ దొరికింది గానీ, డబ్బులు మాత్రం విరజ కెంతిచ్చారో అంతా ఇవ్వాలని పట్టుబట్టింది.

"మనమున్నది ముగ్గురం. విరజంటే దూరం నుండి రావాలి కాబట్టే పెంచి ఇచ్చాం. అంతే కావాలంటే ఎలా?" ఇది ప్రతిభ తర్కం.

"వీళ్ళకు డబ్బు తప్ప మరో ధ్యాసుండదు. అవసరం మనది. అడిగినంత ఇవ్వటమే మంచిది. మరొకరు దొరుకుతారన్న నమ్మకం లేదు" ఇది నా అనునయింపు. మొత్తం మీద ప్రతిభకు నచ్చచెప్పాల్సి వచ్చింది.

దుర్గను చూస్తుంటే కొంత వింతగా అనిపించింది. నవ్వు కూడా వచ్చింది. సిరా రంగు వర్ణం. కొద్దిగా పసిపిల్ల అల్లరి మనస్తత్వం. ఆమె అనాకారి మొఖంలో మెరిసే రెండు పెద్ద పెద్ద కళ్ళు. ఆకర్షణీయంగా అమిరాయి. నుదుటన పెద్ద కుంకుమ బొట్టు. పాపిటనిండుగా కుంకుమ పూసినట్లుగా కాక పోసినట్లుగా వుండేది. మెడలో ఏవేవో పూసలదండలు, చేతుల నిండా ఎర్రని చమ్కీ గాజులు– మనసు కూడా ఎలాంటి ఊహలకు రెక్కలిస్తుందో తెలియదుగాని. అమె రూపం, అలంకరణ తీరు చూసి మనసులోనైనా నవ్వుకోకుండా ఉండలేము.

దుర్గ పని ప్రతిభకు నచ్చింది. "పని బాగా చేస్తుంది. శుభ్రంగా కూడా చేస్తుంది" అని మెచ్చుకుంది ప్రతిభ. "ఒకసారి చెపితే వెంటనే అర్థంచేసుకుంటుంది. మాటి మాటికి చెప్పాల్సిన అవసరముండదు. చిన్న పిల్లాడు రాజుకు సంబంధించిన పనులన్నీ ఇంకా శ్రద్ధగా చేస్తోంది".

మాకు కూడా అలాంటి పనిమనిషే కావాలి. చీటికి మాటికి చెప్పిచేయించుకునే టైముండదు. ఓపిక కూడా లేదు. పరిస్థితులు అనుకూలించనప్పుడు సర్దుకు పోవాలిగదా. "నీకు పనిమనిషి నచ్చింది. అందుకని ఆమెతో జాగ్రత్తగా వ్యవహరించు. చక్కగా పనిచేసే వాళ్ళు మాటి మాటికి దొరకరు" అని హెచ్చరించాను ప్రతిభను.

కొన్నిరోజుల వరకు తన పనేదో తాను చేసుకుపోయే దుర్గ రాను రాను వసపిట్టయింది. రావటంతోనే ప్రతిభ ఎదురుగా కూర్చుని తన చరిత్ర, ఇంటి చరిత్ర ఏకరువు పెట్టటం మొదలు పెట్టింది. మా విషయంలో కూడా వివరాలడగటం ప్రారంభించింది. దాని వాగుడుతనానికి ప్రతిభ కొన్నిసార్లు నవ్వుకునేది. మరి కొన్నిసార్లు విసుక్కునేది.

"దానికి మాటలెక్కువయినాయి. వసపిట్టలా వాగుతోంది. దీని నాలుకకు విశ్రాంతి అనేది ఉన్నట్లులేదు. నేను ఊకొడ్తూ నెట్టుకొస్తున్నాను. నేను కూడా మాట కలిపానంటే ఇక నాకు శ్వాస పీల్చుకోటానికి సమయం ఇవ్వదు" అంది ప్రతిభ

నాతో.

దుర్గది బస్తర్ జిల్లాలో ఏదో కుగ్రామం. పని కోసం ఉన్న వూరు వొదిలి, పొట్ట చేత బట్టుకుని, అటూ ఇటూ తిరిగి, ఇక్కడి దాకా వచ్చింది. ఆమె భర్తకు బాగా తెలిసిన స్నేహితుడొకడు ఆమెనిక్కడికి తీసుకొచ్చాడట. దగ్గరలో అపార్ట్‌మెంట్స్ కడుతుంటే ఆమె భర్త అక్కడ వాచ్‌మెన్‌గా కుదిరాడట. నెలకు ఎనిమిది వందల జీతం. తను రెండు మూడిళ్ళలో పని చేసుకుంటే, ఐదారు వందలొస్తాయి. పిల్లలు లేరు. పిల్లల మాట ఎత్తితే ఆమె అకస్మాత్తుగా ఉదాసీనంగా ఉండిపోతుంది. పెళ్ళయి ఎనిమిదేళ్ళయిందట. రెండు మూడు సార్లు గర్భం వచ్చినా, ముందే విచ్చిన్నమైనాయి. ఆ మాట చెప్తూ, మొఖం, కిందికి వేలాడేసుకుని, కాలి మెట్టెలు తిప్పుకుంటూ మౌనంగా కళ్ళనీళ్ళు పెట్టుకుంటుంది. పిల్లలను గురించి ఏ మాట మాట్లాడినా జవాబుగా వొచ్చేవి కన్నీళ్ళే. ఇదంతా ప్రతిభ చెప్తే తెలిసింది. మా దగ్గర పని చేయటం ప్రారంభించి రెండు నెలలైనా నిండక ముందే సెలవులడగటం ప్రారంభించింది. ప్రతిభకు సెలవివ్వాలంటే ప్రాణాంతకమవుతుంది. కారణమడిగిన తర్వాత దుర్గ చెప్పిందట. ఏదో దేవీమందిరానికి వెళ్ళి మొక్కుబడి చెల్లించాలట. అక్కడ దర్శనం చేసుకుని మొక్కితే అనుకున్నది జరుగుతుందట. ఇదంతా అర్థంపర్థం లేని వ్యవహారమని ప్రతిభకు తెలుసు. కాని ఇటువంటి విషయాలలో నచ్చ చెప్పటం నిష్ప్రయోజనమనీ తెలుసు. సెలవు ఇవ్వననటం కూడా కష్టమే. అందుకని సరే ననింది. కాని అది అంతటితో ఆగిపోలేదు. అది కేవలం ఆరంభం మాత్రమే. ఆమె సెలవు పెట్టినప్పుడల్లా మేము ఇబ్బందులపాలు కావాల్సి వస్తోంది.

తర్వాత నెలలో కూడా సెలవు కావాలనింది దుర్గ. కారణం మునుపటి లాంటిదే. మురాదాబాద్‌లో ఎవరో బాబాగారి దర్గాకు పోవాలట. ఆయన ఆశీర్వాదం పొందిన లక్షలాది జనాలకు కోరిన కోర్కెలు తీరాయట. ఎవరూ వొట్టి చేతులతో రాలేదట. అసలే పెద్ద కళ్ళు. బాబా మహిమ చెప్తుంటే ఇంకా విప్పారేవి.

"నిజం అమ్మగారూ! మా గుడిసెల్లో ఒకామె పోయొచ్చింది. ఆయన చేతిలో ఏం మహిముందో తెలియదుగానీ, బాబా చేతితో నిమరగానే ఆమె వెన్నునొప్పి మాయమయిందట. చనిపోయిన ఒక కుర్రాణ్ణి కూడా ఆయన బతికించాడట" అని ఆశ్చర్యంగా నమ్మబలికితే ప్రతిభకు ఏమనాలో పాలుపోలేదు. గునుస్తూనే నాలుగురోజులకు సెలవిచ్చింది, మరో గతిలేక.

ఈ యాత్రల కోసమే కాకుండా, దుర్గ అప్పుడప్పుడు చెప్పాపెట్టకుండా డుమ్మా కొట్టేది. కొన్నిసార్లు ఆలస్యంగా వచ్చేది. ఏవేవో చిన్నా చితక కారణాలు చెప్పేది. రాత్రంతా దోమలు పీకి పెట్టాయనీ, అందుకని ఉదయాన్నే మెలకువరాలేదని, అమావాస్య స్నానానికి నదికి పోయాననీ, వగైరా వగైరా సాకులు వల్లిస్తుంటే ప్రతిభకు కోపం వచ్చేది.

ఒకసారి ముందు మాట మాత్రం చెప్పకుండా నాలుగు రోజులు దుర్గ మాయమైంది. ఆరా తీస్తే ఆమెకు, మలేరియా వచ్చిందని తెలిసింది. ఎలా వస్తుంది? మరోసారి సెలవు ఊసెత్తితే ప్రతిభకు కోపం ఆగలేదు. ఛడామడా అరిచింది. కళ్ళల్లో నీళ్ళు కుక్కు కుంటూ మౌనంగా పనిచేసుకుపోయింది దుర్గ. ప్రతిభకు జాలి కలిగింది. ఈ పనికిమాలిన పనులవల్ల పిల్లలు పుట్టరనీ, దేవుళ్ళనూ, బాబాలను నమ్మొద్దనీ. ఎవరైనా మంచి డాక్టరును సంప్రదించి మందులు వాడితే మంచిదని సలహా ఇచ్చింది. కళ్ళనీళ్ళు కొంగున తుడుచుకుంటూ అదే పనిగా చెప్పుకుంటూ పోయింది దుర్గ. ఆమె చూడని డాక్టర్ లేడట. అన్నిరకాల మందులు మింగిందట. పూర్వజన్మలో ఏదో పాపం చేశానని వాపోయింది. ఆమెను ఉపశమింప చేయటానికి ఆమె భర్త కూడా అదే చెప్పాడట. తమకు పిల్లలను ఇవ్వటం భగవంతునికి కూడా ఇష్టం లేదనీ, తమ నొసటి మీద సంతాన యోగం రాసిలేదనీ చెప్పాడట. కాని ఆడపడుచులూ, అమ్మలక్కలందరూ ఆడజన్మ ఎత్తిన తర్వాత కడుపు పండకపోతే, ఆ జన్మే నిరర్థకం అంటారట. ఇంట్లో పిల్లలు తిరగకపోతే. కట్టుకున్న మొగుడు కూడా చులనకగా చూస్తాడని చెప్పారట. ఆమె మాటలకు, ప్రతిభ నిలువెల్లా కరిగిపోయి సెలవిచ్చేసింది.

కొన్ని రోజుల తర్వాత దుర్గ మళ్ళా మలేరియా బారిన పడింది. ఇంట్లో ఉపయోగించకుండా ఉన్న దోమ తెర జ్ఞాపకమొచ్చి, తీసుకుపొమ్మని ఇచ్చాము. డబల్ కాట్ కోసం ఆర్డరిచ్చి కుట్టించాము. కాని రెండు సింగిల్ మంచాలు రావటం వల్ల అది నిరుపయోగమయింది. బద్ధకం వల్ల దానిని తిరిగి షాపు వాడికివ్వలేక పోయాను. దానిని చూసి దుర్గ మొఖం వికసించింది. మరుసటి దినం కృతజ్ఞతా పూర్వకంగా చిరునవ్వు నవ్వుతూ, రాత్రంతా తాము సుఖంగా నిద్ర పోయామని చెప్పింది. తన భర్త రాత్రంతా తమను గురించే మాట్లాడాడట. నేను చస్తే చర్మంతో అయ్యగారికి చెప్పులు కుట్టించి ఇచ్చినా రుణం తీరదు అన్నాడట.

ఈ కాలంలో ఇంత కృతజ్ఞతా? నా మనసంతా ఆనందంతో నిండిపోయింది. దాని తర్వాత దుర్గలో మునుపటి కంటే పనిలో చురుకుదనం కనిపించింది. కాని సెలవులడగటంలో మార్పు ఏ మాత్రం లేదు. ఒక రోజు దైవదర్శనం. మరొకరోజు ఎవరో ఫకీరు బాబా. ఎవరో సాధుమహరాజ్ కోసం ఇంకోరోజు.

ఒకసారి ఎందుకో నాలుగైదు రోజులు సెలవు తీసుకోకుండానే డుమ్మా కొట్టింది. తిరిగి రాగానే ఆమెపై విరుచుకు పడేందుకు సిద్ధమయింది ప్రతిభ. కాని ఆ రోజున ఆమెను చూడగానే ప్రతిభ కోపమంతా మాయమైపోయింది. దుర్గ కళ్ళు ఇంకిన కొలనుల్లా వున్నాయి. వారం దినాల నుండి కంటి మీద కునుకులేని దానిలా కళాహీనంగా డస్సిపోయి కన్పించింది. ఆమె నడిచి వచ్చిన తీరు చూస్తే వచ్చింది దుర్గ కాదు, కేవలం ఆమె నీడలా అనిపించింది. తల దించుకుని ఓ మూల మౌనంగా కూర్చుండిపోయింది, ఉలుకుపలుకు లేకుండా. జరగకూడనిదేదో జరిగిందని భయపడి పోయింది ప్రతిభ. కొద్దిపాటి సమయమిచ్చి అనునయిస్తూ అడిగిన మీదట దుర్గ దుఃఖం కట్టలు తెంచుకుంది. ప్రతిభ ఒడిలో తలపెట్టి చిన్న పిల్లలా వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది. తర్వాత దుర్గ చెప్పిన విషయం ప్రతిభ నోటి ద్వారా వింటుంటే, బహుశా నేను కలలో కూడా అటువంటిది ఊహించలేననిపించింది.

ఈసారి ఎవరో ఫకీరు దగ్గరికి వెళ్ళిందట. నవమాసాలు దాటటంతోనే ఆమెకు తప్పకుండా కొడుకు పుడ్తాడని నొక్కి చెప్పాడట. అతటి ప్రభావం వల్ల పుట్టిన చిరునామాలు ఏకరువు పెట్టాడుట. దుర్గకు చాలా నమ్మకం కుదిరింది. ఆమెను దూరం నుంచి చూస్తూనే చెప్పాడుట, ఆమె సంతానం కోసం ఆరాటపడుతోందని. అందరి ఎదురుగానే ఆకాశంకేసి చూస్తూ చేత్తో చప్పట్లు కొట్టి ఏదో మంత్రాలు వల్లిస్తే చేతిలో అరటిపండు వచ్చిందట. అది శుభశకునమనీ, పిల్లలు కలుగుతారనటానికి అది సూచన అని చెప్పాడట. ఐదువందల రూపాయలు అతనికోసం ఖర్చు చేయాలట, సంవత్సరం నిండని ఎవరైనా బాలుణ్ణి తీసుకొచ్చి తనతో పాటు స్మశానానికి వచ్చి, బాలుడిని బలిస్తే ఆమెకు సంతానం కలుగుతుందని చెప్పాడట. అతని బంటొకనికి మరో ఐదువందలిస్తే అతడే బాలుడిని సమకూరుస్తాడట. పిల్లవాణ్ణొకణ్ణి వెంటబెట్టుకుని దుర్గ శ్మశానానికి వెళ్లిందటగానీ ఆమె మనసు అంగీకరించలేదట. వద్దని వెనక్కి మరలి వస్తుంటే ఆ ఫకీరు భయపెట్టాడట. పిల్లవాడు ఆమె దగ్గర దొరికితే జైలుకు పోవాల్సి వస్తుందని చెప్పాడట. ఎవరైనా పిల్లవాణ్ణి అతని తల్లిదండ్రులకు అప్పచెప్పటానికి పోయినా, వాళ్ళకూడా కటకటాల వెనక్కు పోక తప్పదని బెదిరించాడట. ఎంత బెదిరించినా, హెచ్చరించినా ఖాతరు చేయకుండా ఆ కుర్రాడి వివరాలు కనుక్కుని నేరుగా అతని తల్లిదండ్రులకు అప్పచెప్పిందట. నెపమంతా తన మీదేసుకుని వాళ్ళ కాళ్ళ మీద పడిందట. వాళ్ళు మొదట పోలీసులను పిల్చి ఆమెను అప్పచెప్పాలని అనుకున్నారట. క్లుప్తంగా పనిమనిషి నోటి నుండి విన్న వృత్తాంతమంతా ప్రతిభ నాకు చెప్పింది. ఈ అనుకోని సంఘటన విని ప్రతిభ కూడా నివ్వెరపోయింది. దుర్గ మనసు తెలుసుకుందామని ఆమెను ఇంకా ప్రశ్నిస్తే...

"అమ్మగారూ! ఆ ఫకీరు మాటలు నిజమో కాదో ఎవరు చూడొచ్చారు? కాని నా కడుపు పండించుకోటానికి, పరాయమ్మ కడుపున చిచ్చుపెట్టటం ఏల న్యాయం? చివరకు మనం చచ్చిన తర్వాత ఆ దేవుడికి మొఖం చూపలేముగదా!" అనిందట. నాకు మనసులో మెదిలింది. ఒకనాడు నేను అపోహ పడ్డాను, ఈ అంగిరి జనాలకు యుక్తాయుక్త పరిజ్ఞానం ఉండదని. వాళ్ళకెప్పుడూ డబ్బు యావతప్ప మరేమీ ఉండదని. కాని నా ఆలోచన పూర్తిగా తప్పు అని ఇప్పుడు అర్థమైంది. దుర్గ దృష్టి, నిజానికి చాలా దూరం దాకా చూడగలదు. చాలా చాలా చాలా దూరం దాకా!

★

కొత్త పుస్తకాలు

అక్షర 'బంధన ఛాయ'

ఆకుపచ్చులోయలో తన హృదయ సుకుమార పచ్చిక మైదానాలను అక్షరబద్ధం చేసిన నామాడి శ్రీధర్ మృదులమైన కాన్క 'బంధన ఛాయ'. మెలకువలో, నిదురలో, కలలో కవిత్వాన్ని కలవరించి పలవరించే శ్రీధర్ అచ్చమైన కవిత్వం పాఠకులను అక్షర బంధనం చేస్తుంది. 61 కవితల ఈ సంకలనంలో అక్షరాక్షరానా కవిత్వం తొణికిసలాడుతుంది. కవిత్వం పట్ల కవి నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

'అడవిలో అన్నలతో / రైతు కూలీ పాటలతో / పూర్వ బాంధవ్యం తెగిపోయింది / ఏ మేడే ప్రచండవాయువు తలుపు తట్టదు / నొప్పి అంటని పాషాణ గుణమేదో గుండెకు అబ్బుతోంది' అని స్వచ్ఛందంగా సంజాయిషీ పత్రం రాసిచ్చిన కవి శ్రీధర్. ప్రకృతితో, మూగవోయిన తల్లితో, వెంటాడే జ్ఞాపకాలతో, పునరాగమన బాల్యకల్పనలతో, సంభాషిస్తూ బహుధా వందనీయ దివసాన్ని పరవశంతో ముద్దిడి నిర్వ్యాపక ఉదయోత్సవాల్లో విహరిస్తూ కవి ప్రయాణించాడు. 'ఆనవాలు పట్టి సమ్మిళిత సుదూర జ్ఞాపకాలను మృదువుగా విప్పుతాను ఒక్కటొక్కటి' అని గతాన మరలిపోయిన ఆనందాల కోసం ఆవిష్కృతమైన ఆవేదన పాఠకుని అంతరంగంలో అలజడి రేపుతుంది. 'ప్రథమ స్వప్నాలన్నీ విహ్వల దుఃఖాశ్రువులు/నిరాధార ప్రేమలేఖ ఉల్కలు' 'నీ ఆర్ద్ర నయనాల నైర్మల్యపు తళతళలో తడిసిపోనివ్వు' (వన్యపుష్పం) 'నీకై ఒంటరి ఎదురుచూపుల రెపరెపల దీపస్తంభమై' (పొగమంచు, అందొక దీపస్తంభం) 'నువ్వులేని నిరంతర ఏకాంతం' (పుష్పసేకరణ) కవితల్లో వెంటాడే బాల్య ప్రియురాలి స్మృతిని తడుముకుంటాడు. సహజ ప్రకృతి ప్రేమికుడైన శ్రీధర్ ప్రియురాలి వంటి నిత్య హరిత వృక్షాన్ని, ఆమె బాహువుల్లోంచి గొంతు విప్పే పక్షిని, అంతరంగంలో అమృతాన్ని నింపే కలకూజితాన్ని, మరి మరీ సీతాకోకచిలుకల్ని (కలకూజితం), తీరం మీద పరిమళ పుష్పాల తీగల్ని, అవి ప్రతిఫలించే సరసుని (అనంతర భ్రమ), పదిలంగా దాచుకొన్నాడు. అవి లేకుండా పోతున్న వర్తమాన వాస్తవం పట్ల వగస్తాడు. ఒకే పోలికలో ఉన్న సీతాకోకచిలుకల్ని చూడటంతో గడిచిపోతుంది, నిన్నటిలా ఈరోజు కూడా' 'అర్ధరాత్రి నిశలో/చామంతి వన్నె సీతాకోకచిలుక' (అనంతర భ్రమ) రెక్కలు విరిగిన సీతాకోకచిలుక కడపటి రెపరెపలా (విడిచిన రేవు) 'మరి నిన్ను అలముకున్న సీతాకోకచిలుకలన్నీ నా దివా స్వప్నాలు (ఇటీవల కల) అని కవిత్వంలో సీతాకోకచిలుకలను ఎగరేస్తాడు. అంతరించిపోతున్న పక్షులు, వాతావరణ కాలుష్యం నేపథ్యంలో పక్షిని మృదువుగా పొదుముకొని 'కాళరాత్రినొక నల్లమందు గుళికవలె మింగిన కోకిల ఈ హృదయం' (పునర్గానం) 'కొంగల సమూహం, గోరింకల సల్లాపం, లకుముకి పిట్టల జంట (కలకూజితం), పంట కాల్వనుంచి తెల్లటి కొంగ ఎగిరిపోయింది (తిరుగు ప్రయాణం) అని బహుకాల పక్షిగానం (ఛాయాస్పర్శ) చేస్తాడు. పక్షిపిల్ల మొదటిసారి ఎగిరినప్పటి సాచిన రెక్కల కాంక్షతో, అసంపూర్ణ దివ్యస్వప్నం అవ్యక్త ఆప్తవాక్యం/ఆరిపోయిన కొవ్వొత్తి వడిలిపోయిన పువ్వుల గుత్తి/రోదించి నిదురించే కవలచందనంలాంటి రెండు అరచేతులు/ఎవరు పిలిచేరని బదులు పలుకుతాయి (స్మారక దివసం). అని ఆప్తులను స్మరించుకొని మూగగా రోదిస్తాడు. 'అమ్మ ఉన్నప్పటి ఇల్లు ఒక్కటే మళ్లీమళ్లీ తిరుగువస్తున్న కల' అని మదనపడే శ్రీధర్ ఓ యావజ్జీవిత గర్భస్థ వ్యధనీ తన తల్లిని గురించి విలపిస్తాడు.

'ప్రత్యుత్తరం లేని అర్ధాంతర మృత నిశ్శబ్దం/ఆఖరి ముద్దువలె నిన్ను అందుకోలేని వీడ్కోలు సైగని ఏ బంగరు తల్లి కనుల కారుణ్యంలో వెతకమంటావు', 'దినాంత గోధూళిలోంచి ఆశాంతకనులు సంచరించే కార్తీక పూర్ణిమ వెన్నెలతో కలిసి నువ్వు మాత్రమే వింటావు సుమా' అని మదన పడతాడు. ఈ సంకలనంలో ప్రత్యేకంగా నిలిచే కవిత 'ఒలేస్యా ఓ కలావరురాణి'. రష్యన్ రచయిత 1898లో రాసిన ఒలేసియా కథ ఇప్పటికీ తెలంగాణలో మంత్రగత్తెల పేర కొనసాగుతున్న హత్యలను ప్రతిబింబిస్తుంది. ఆ కథలో లీనమై రాసిన కవిత సంపుటిలో సమున్నతంగా నిలుస్తుంది. వివిధ భాషలకు చెందిన అత్యుత్తమ కవితలను శ్రీధర్ కవిత్వీకరించిన తీరు పాఠకుల్ని అబ్బుర పరుస్తుంది. సర్వేశ్వర దయాల్ సక్సేనా 'అయిదు పొరల చాంద్ర రస్మి', 'వ్యాకులత', పూమ ఈశ్వరమూర్తి 'వర్షవిశాలత', ల్యాబీభట్ల 'పసిచెట్టు' అనువాద వాసన లేకుండా అనుభవానికొస్తాయి. చాలా కాలం తరువాత కవిత్వం చదివామన్న ఆనందాన్ని మిగులుస్తుంది 'బంధనఛాయ'.

బంధన ఛాయ
వెల : 50/-
ప్రతులకు:
నామాడి శ్రీధర్: అంబాజీపేట,
తూర్పుగోదావరి - 533 214.
సెల్ : 9396807070
మరియు అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.

- బడుగు భాస్కర్ జోగేష్

విజేతలదే ప్రపంచం
గువ్వల కోటయ్య
వెల :80/-, పేజీలు : 116
ప్రతులకు
అన్ని పుస్తక షాపుల్లో



మది దోచే సిరామిక్ శిల్పాలు

తెల్లగా నిగనిగలాడే అందమైన అలంకరణలతో కూడిన పింగాణీ పాత్రలంటే మోజుపడని వారెవరు? అటు అలంకరణ సామాగ్రిగాను, ఇటు వినియోగ సరంజామాగాను రెండు రకాలుగా ఇవి ఉపయోగపడుతుంటాయి. ఎంత అందంగా ఉన్నా, వాటి విలువ ఎంత అధికంగా ఉన్నా అవి ప్రధానంగా వాటి వినియోగ ధర్మం రీత్యానే గుర్తించబడుతుంటాయి. కాని అదే పింగాణీ సామాగ్రిని అందంగా ఆకర్షణీయంగానే కాకుండా, కళాత్మకంగా తీర్చిదిద్దినపుడు వాటి లక్షణం పూర్తిగా మారిపోతుంది. వినోద్ దారజ్ సిరామిక్ శిల్పాలు కచ్చితంగా అలాంటివే. హైదరాబాదు, కళాకృతి ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శించబడుతున్న ఆ కళారూపాలు ప్రేక్షకుల మది దోస్తున్నాయి. దారజ్ స్వతహాగా ఆభరణాల తయారీ కుటుంబానికి చెందిన వాడు కావడంతో ఈ శిల్పాలలో అలంకరణ లక్షణాలు కూడ పుష్కలంగా ప్రతిబింబిస్తున్నాయి. పోర్సిలిన్‌తో పాటు, శిలలతో కూడ దారజ్ కళారూపాలు సృష్టించారు. ఈ ప్రదర్శనకన్నా ముందు, బుద్ధుని బోధనలను ప్రధానాంశంగా తీసుకొని ఒక కళా ప్రదర్శనను నిర్వహించారు. ప్రస్తుత ప్రదర్శనలోని శిరామిక్ శిల్పాలు అటు సౌందర్యాన్ని, ఇటు భావాలను సమానంగా వ్యక్తం చేసిన విలక్షణ కళారూపాలు. వీటి రూపకల్పనకు కేవలం పోర్సిలిన్ ఒక్కటే కాకుండా దారం, ఆక్రిలిక్ కలర్, వెండి, బంగారు మెరుగులతో పాటు, వెలుతురును కూడ మీడియాగా వినియోగించడం విశేషం.

2009 జూన్ 17న ప్రారంభమయిన ఈ ప్రదర్శన 2009 జులై 10 వరకు కొనసాగుతుంది.

-జి.వి



కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకొని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫోటోను అతికించి పోస్ట్ చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలు చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే.

మరి మా అడ్రస్ కలంస్నేహం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, అజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్.

పేరు: మహమ్మద్ ఆసియా
చదువు: 7వ తరగతి
వయస్సు: 12 సం॥
స్కూలు: శ్రీవాణి విద్యాలయం
లక్ష్యం: టీచర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవడం, టీవీ చూడడం
చిరునామా: మహమ్మద్ ఆసియా
డాటరాఫ్ రాజహ్మద్, నంగునూరు(గ్రా),
నంగునూరు(మం), మెదక్.

పేరు: కె. రాజేష్
చదువు: 8వ తరగతి
వయస్సు: 14 సం॥
స్కూల్ : బి.వి సుబ్బయ్య హైస్కూల్
లక్ష్యం: పోలీస్ ఆఫీసర్ కావడం
హాబీలు: ఆటలాడడం, పుస్తకాలు చదవడం
చిరునామా: కె. రాజేష్
సన్నాఫ్ కె. రవికుమార్,
ఒంగోల్, ప్రకాశం.

పేరు: ఎన్. ఆంజనేయులు
చదువు: 9వ తరగతి
వయస్సు: 14 సం॥
స్కూల్: గీతాంజలి ఉన్నత పాఠశాల
లక్ష్యం : ఆర్మీ ఆఫీసర్ కావడం
హాబీలు: క్రికెట్ ఆడడం, పుస్తకాలు చదవడం
చిరునామా: ఎన్. ఆంజనేయులు
సన్నాఫ్ ఎన్.వెంకటయ్య, మారుతి నగర్,
అచ్చంపేట, మహబూబ్ నగర్.

పేరు: ఎన్. శివప్రసాద్
చదువు: 9వ తరగతి
వయస్సు: 14 సం॥
స్కూలు: గీతాంజలి ఉన్నత పాఠశాల
లక్ష్యం: ఇంజనీర్ కావడం
హాబీలు: పాటలు పాడడం, డాన్స్‌చేయడం
చిరునామా: ఎన్. శివప్రసాద్
సన్నాఫ్ ఎన్.బాలు, రంగాపురం,
అచ్చంపేట, మహబూబ్‌నగర్.

పేరు: పులి అనిల్
చదువు: 10వ తరగతి
వయస్సు : 15 సం॥
స్కూల్: తక్షశిల హైస్కూల్
లక్ష్యం : సమాజసేవ
హాబీలు: టీవీ చూడడం, క్రికెట్ ఆడడం.
చిరునామా: పులి అనిల్
కేరాఫ్ వెంకన్న, బయ్యారం, ఖమ్మం.

పేరు: టి.కార్తీక్
చదువు: 7వ తరగతి
వయస్సు: 12 సం॥
స్కూలు: జ్ఞాన భారతి ఉన్నత పాఠశాల
లక్ష్యం : ఐపిఎస్ కావడం
హాబీలు: కారమ్స్ ఆడడం, టీవీ చూడడం
చిరునామా: టి.కార్తీక్
సన్నాఫ్ టి.కృష్ణ, ఇం.నెం.2-17-100,
చుక్కలపల్లి కాలనీ, కొల్లాపూర్, మహబూబ్ నగర్.

పేరు: వి. హరీష్
చదువు: 9వ తరగతి
వయస్సు: 14 సం॥
స్కూలు : గీతాంజలి ఉన్నత పాఠశాల
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు: క్రికెట్ ఆడడం, పుస్తకాలు చదవడం
చిరునామా: వి. హరీష్
సన్నాఫ్ వి.అంబయ్య(పాతబజారు),
అచ్చంపేట, మహబూబ్‌నగర్.

పేరు: జి.దీక్షిత్
చదువు: 8వ తరగతి
వయస్సు: 13 సం॥
లక్ష్యం: ఇంజనీర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవటం,
క్రికెట్ ఆడడం
చిరునామా: జి.దీక్షిత్
కేరాఫ్ ఆర్. విజయ్ కాంత్,
శ్రీరామానగర్ కాలనీ,
పత్తిపాడు, గుంటూరు.